ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY


చిక్కుల్లో భూపాలపల్లి బీఆర్ఎస్

అటు సంక్షోభం.. ఇటు సమరం..





భూపాలపల్లి, మే 31(ఆంధ్రజ్యోతి): భారత రాష్ట్ర సమితి పార్టీలో ఉత్పన్నమైన రాజకీయ పరిణామాలు ఆ పార్టీ శ్రేణులను గందరగోళానికి గురి చేస్తోంది. ఓ వైపు అధికారం కోల్పోయి కాళేశ్వరం ప్రాజెక్టు ఎపిసోడ్‌తో చిక్కుల్లో కొట్టుమిట్టాడుతున్న బీఆర్ఎస్‌లో కేసీఆర్ కుమార్తె కవిత సృష్టించిన సంక్షోభం బీఆర్ఎస్‌ను క్షేత్ర స్థాయిలో అతాలకుతలం చేస్తోంది. బీఆర్ఎస్ బలోపేతంపై ఆ పార్టీ నాయకత్వం దృష్టి సారిస్తున్న వేళ అనుకోని ఉరుముల కవిత సృష్టించిన సంక్షోభం ఆ పార్టీని మరింత విచ్ఛిన్నం చేసే దిశగా నెట్టేస్తోందన్న అభిప్రాయాలను రాజకీయ విశ్లేషకులు వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా ఉత్తర తెలంగాణకు కేంద్ర బిందువుగా ఉన్న వరంగల్, కరీంనగర్ జిల్లాలో కవిత సృష్టించిన సంక్షోభం ఆ పార్టీని దెబ్బతీసే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఇక భూపాలపల్లి జిల్లా విషయానికి వస్తే ఇక్కడ కూడా దాదాపు అదే పరిస్థితి కన్పిస్తోంది. జిల్లాలోని భూపాలపల్లి మంథని శాసనసభ నియోజకవర్గాల పరిధిలో ఇప్పటికే బీఆర్ఎస్ పార్టీ నాయకత్వానికి సంబంధించి మూడుముక్కలాట కొనసాగుతుండగా, తాజాగా కవిత తెలంగాణ జాగృతిని కూడా తెర పైకి తెచ్చేందుకు ప్రయత్నిస్తుండడంతో ఆ పార్టీలో చీలిక తథ్యమన్న అభిప్రాయాలున్నాయి. ముఖ్యంగా కవిత వర్గం గత వారం రోజులుగా వ్యూహాత్మకంగా వ్యవహరిస్తూ తెలంగాణ జాగృతిని క్షేత్ర స్థాయిలో బలపరిచేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా రెండురోజుల క్రితం కోల్‌బెల్ట్ ఏరియా ఇన్‌చార్జిలను నియమించడం రాజకీయంగా ప్రాధాన్యతను సంతరించుకుంది. అటు పెద్దపల్లి, భూపాలపల్లి జిల్లాలో విస్తరించి ఉన్న బొగ్గు గనుల్లో గతంలో టీజీబీకేఎస్ బలంగా ఉండేది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ కార్మిక సంఘం ఇంచుముంచు కనుమరుగైంది. తాజా పరిణామాలతో బీఆర్ఎస్ అసంతృప్తితో పాటు టీజీబీకేఎస్‌లో కీలక పాత్ర పోషించిన నేతలను సమన్వయ పరిచి కొత్త కమిటీలను ఏర్పాటు చేసే దిశగా కవిత వర్గం కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. దీంతో రానున్న రోజుల్లో ఈ ప్రాంతంలో సరికొత్త రాజకీయ సమీకరణలు తెరపైకి వచ్చే అవకాశాలున్నాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

స్థానిక ఎన్నికల వేళ..

త్వరలో రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించనున్నట్టు ప్రకటించిన నేపథ్యంలో బీఆర్ఎస్‌లో ఉత్పన్నమైన సంక్షోభ పరిస్థితులు బీఆర్ఎస్‌ను దెబ్బతీసే అవకాశం ఉంది. అదే సమయంలో ఈ పరిణామాలు అధికార కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు రాజకీయంగా లబ్ధిచేకూర్చే పరిస్థితి ఉండొచ్చని పరిశీలకులకు అంటున్నారు. జులై చివరి వారంలో గ్రామ పంచాయతీ, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడనున్నట్టు వార్తలు వస్తుండటంతో దాదాపు అన్ని పార్టీల్లో కోలాహలం మొదలైంది. సరిగ్గా ఈ పరిస్థితుల్లో కవిత బీఆర్ఎస్ అధిష్టానంపై సంధించిన ప్రశ్నలతో ఆమె కాంగ్రెస్ పార్టీలో చేరుతుందా..? లేక ఒంటరిగా సొంత కుంపటి పెట్టుకొని తెలంగాణ జాగృతి బ్యానర్‌పై స్థానిక సంస్థల్లో ఎన్నికల్లో పాల్గొనబోతోందా అనేది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. మరో వైపు బీఆర్ఎస్ నాయకత్వం మాత్రం స్థానిక ఎన్నికలపై కవిత ప్రభావం ఏ మాత్రం ఉండదని పైకి ధీమాగా చెబుతున్నా అసంతృప్త ద్వితీయ శ్రేణి నాయకత్వం, కార్యకర్తలు అటు వైపు వెళ్లిపోయే అవకాశం ఉందన్న భయం ఆ పార్టీ నేతల్లో కన్పిస్తోంది. దానికి తోడు భూపాలపల్లి నియోజకవర్గంలో ఇప్పటికే శాసన మండలి నేత సిరికొండ మధుసూదనాచారి, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డిలు నియోజకవర్గంపై పట్టు కోసం ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారు. ఈ ఇరువురు నేతల మధ్య నలిగిపోతున్న క్యాడర్‌లో కొంత మంది కవిత సొంత పార్టీ పెడితే అటువైపు మొగ్గే అవకాశం ఉందని అంచ నా వేస్తున్నారు. మరో వైపు మంథని నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే పుట్టమధు నాయకత్వం పట్ల అక్కడి కార్యకర్తల్లో కొంత అసంతృప్తి ఉన్నప్పటికీ అంతర్గత విబేధాలు లేవు. అయితే స్వయంగా పుట్ట మధు కవితతో సంబంధాలు కలిగి ఉండడంతో కవిత సొంత పార్టీ పెడితే ఆయన ఎటు వైపు మొగ్గుచూపుతారన్న దానిపై ఆసక్తికరమైన చర్చలు సాగుతున్నాయి.

> కవిత ఎపిసోడ్‌తో పార్టీ శ్రేణుల్లో గందరగోళం
> తేల్చుకోలేక పోతున్న కార్యకర్తలు
> జాగృతి బలోపేతంపై కవిత బృందం దృష్టి
> స్థానిక సమరం సమీపిస్తున్న వేళ ఆసక్తికర పరిణామాలు

ఇది మాదిగ జాతికి దక్కిన గౌరవం

- పద్మశ్రీ పురస్కారంపై మంద కృష్ణ మాదిగ
- అవార్డు అందుకున్న తర్వాత తొలిసారిగా నగరానికి రాక
- వరంగల్ రైల్వేస్టేషన్ నుంచి హనుమకొండ వరకు ర్యాలీ
- కాళోజీ కళాక్షేత్రంలో ఘనంగా సన్మాన సభ


వరంగల్‌లో వాహనంపై నుంచి ప్రసంగిస్తున్న మంద కృష్ణమాదిగ

వడ్డెపల్లి/గిర్మాజీపేట, మే 31 (ఆంధ్రజ్యోతి): మూడు దశాబ్దాల సుదీర్ఘ పోరాట ఫలితంగానే తనకు పద్మశ్రీ పురస్కారం వచ్చిందని, ఇది మాదిగ జాతికి దక్కిన గౌరవమని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ అన్నారు. భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా న్యూఢిల్లీలో పద్మశ్రీ పురస్కారం అందుకున్న అనంతరం శనివారం రాత్రి తొలిసారి కృష్ణ మాదిగ వరంగల్‌కు వచ్చారు. ఎమ్మార్పీఎస్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల కమిటీ ఆధ్వర్యంలో వరంగల్ రైల్వేస్టేషన్ నుంచి హనుమకొండ కాళోజీ కళాక్షేత్రానికి మందకృష్ణ మాదిగ భారీ స్వాగత ర్యాలీతో తరలివచ్చారు. అనంతరం కాళోజీ కళాక్షేత్రంలో కృష్ణ మాదిగకు సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మార్పీఎస్ ఉద్యమానికి సమాజంలోని అన్నివర్గాల ప్రజల అండ ఉందన్నారు. పద్మశ్రీ పురస్కారం రావడానికి అదే ప్రధాన కారణమన్నారు. వ్యక్తిగా పద్మశ్రీ పురస్కారం తనకే దక్కినప్పటికీ.. అది యావత్తు మాదిగ జాతికి దక్కిన గౌరవమేనని స్పష్టం చేశారు. 30 ఏళ్ల ఎమ్మార్పీఎస్ ఉద్యమ ప్రయాణంలో సమాజంలోని అన్నివర్గాలు సహకారం అందించడం వల్లే ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా ధైర్యంగా నిలబడి ఎస్సీ వర్గీకరణను సాధించామని తెలిపారు. ఎస్సీ వర్గీకరణ

మిగతా 8వ పేజీలో...


నక్సల్స్ స్థావరాల కోసం వాగులు దాటుతున్న గ్రేహౌండ్స్ దళాలు

బిక్కు బిక్కుమంటున్న గిరిజన గూడేలు

- ఎన్‌కౌంటర్లతో అలజడి వాతావరణం
- పోలీసుల ముమ్మర గాలింపు చర్యలు


అడవుల్లో కూబింగ్ చేస్తున్న పోలీస్ బలగాలు

ఏటూరునాగారం, మే 31 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా ఏటూరునాగారం ఏజెన్సీలోని గొత్తికోయ గూడేలలో తీవ్ర అలజడి నెలకొంది. ఇటీవల ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో జరిగిన కర్రెగుట్ట ఎన్‌కౌంటర్ల నుంచి తప్పించుకున్న మావోయిస్టులు గొత్తికోయగూడాల్లో తలదాచుకున్నారనే నేపంతో పోలీసులు ఛత్తీసగఢ్ రాష్ట్ర నుంచి వలస వచ్చిన గూడాలపై మరింత నిఘా పెంచారు. దీంతో మావోయిస్టుల ఆచూకీ కోసం పోలీసులు విస్తృతంగా గాలింపు చర్యలు చేపడుతున్నారు. ఈ పరిణామాలతో ఆదివాసీ గూడాల గొత్తికోయలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. నెలరోజుల నుంచి వరుసగా జరుగుతున్న కర్రెగుట్ట ఎన్‌కౌంటర్‌లో పలువురు మావోయిస్టులు మరణించగా, మరికొందరు తప్పించుకున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ నేపథ్యంలో, వారు గొత్తికోయగూడాల్లో తలదాచుకుని ఉండే అవకాశం ఉందని భావిస్తున్నారు. దీంతో పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తూ, ప్రతి ఇంటిని, ప్రతి వ్యక్తిని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఈ ఆకస్మిక తనిఖీలతో గొత్తికోయగూడాల ఆదివాసీలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. మావోయిస్టుల సంచారం ఎక్కువగా ఉండే ఈ ప్రాంతంలో, ఎన్‌కౌంటర్ల అనంతరం పోలీసులు మరింత అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. గ్రామాల్లోని వచ్చిన వారి వివరాలను సేకరిస్తూ, అనుమానితులను విచారిస్తున్నట్లు తెలుస్తోంది. కాగా, ఈ మధ్యకాలంలోనే సుమారు 34 మంది మావోయిస్టులు ములుగు జిల్లా పోలీసులకు చిక్కారు. మారో ఎనిమిది మంది ఇటీవల లొంగిపోయారు.

PUBLIC NOTICE

Under the instruction of my client, Public at large is hereby informed that my clients **K. Padma w/o Late Buchi Reddy** and others filed **Second Appeal. No. 165 of 2023** before the Hon'ble High Court of Telangana at Hyderabad on 23-10-2024 the Honble Court passed Interim Order that both the parties shall maintain **"Status Quo"** until further orders with regard to subject property of O.S No. 1599 of 2012 on the file of the V Additional Junior Civil Judge at Warangal.

Suit Schedule Property

Agriculture land to an extent of Ac. 0.17 gts equivalent to 0.17 Hectors in Sy. No. 335/1 and in Sy. No. 336/1 situated in Ursu within the limits of Gram Panchayat, Thimmapur and Extended limits of Warangal Municipal Corporation.

East: 40' wide road
West: Land of others
North: 40' wide road
South: Land of T. Bikshapati

Therefore, the concerned parties, individuals and organizations take note of this matter and comply with the orders of the High Court despite this notice shall do so at their own risk and consequences, as the matter is sub judice and subject to adjudication before the Hon'ble Court. This notice is published in the third-party interest and safeguard the subject property.

Sd/- Mr. B. SRIKANTH, Advocate
Address: Plot No #234 Kalyannagar, Adj Lane to ICICI Bank Lane, Vengal Rao Nagar, Hyderabad-38.

సమష్టి కృషితోనే పుష్కరాలు సక్సెస్

- అధికారుల పనితీరు భేష్
- రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

భూపాలపల్లిటౌన్, మే 31 (ఆంధ్రజ్యోతి): సమిష్టి కృషితోనే సరస్వతి పుష్కరాలు సక్సెస్ అయ్యాయని, ప్రభుత్వానికి మంచి పేరు వచ్చిందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. శనివారం భూపాలపల్లి పట్టణంలోని పుష్ప గ్రాండ్ ఫంక్షన్‌హాల్‌లో పుష్కరాల డే ఆఫ్ థాంక్స్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధ్యక్షతన వహించగా ముఖ్య అతిథిగా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారం భించారు. అనంతరం ఆయన అధికా రులను ఉద్దేశించి మాట్లాడారు. పుష్కరా లను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు రూ.40 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్‌ఖరేలతో పాటు అన్ని శాఖల అధికారులు నిర్విరామంగా కృషి చేశారని అన్నారు. వారిని ఈ సందర్భంగా అభినందించారు. ఒక్కొక్క విభాగానికి చెందిన అధికారఘనాన్ని పిలిచి శాలువాతో సన్మానం చేసి జ్ఞాపికను అందజేశారు. పుష్కరాల సందర్భంగా సాయంత్రం నిర్వహించిన నవరత్న మాల హారతి కార్యక్రమం మొత్తం పుష్కరాలకే ప్రధాన ఆకర్షణగా నిలిచిందని అన్నారు. పుష్కరాల ద్వారా ఆర్టీసీకి సుమారు రూ.10 కోట్లు ఆదాయం వచ్చిందని అన్నారు. జిల్లా కలెక్టర్, ఎస్పీలు 33 శాఖల అధికారులను సమన్వయం చేసి మూడు నెలలు కష్టపడితే విజయ వంతమయిందని తెలిపారు. సరస్వతి పుష్కరాలలో జిల్లా అధికారుల పనితీరు అభినందనీయమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు ఉచిత భోజన సౌకర్యాన్ని కమలాపూర్ క్రాస్ వద్ద ఏర్పాటు చేయగా పలు సంఘాలు ఎంతో సహకారాన్ని అందించాయని అన్నారు. కలెక్టర్ రాహుల్‌శర్మ మాట్లాడుతూ జిల్లాలోని 33శాఖల అధికారులు పుష్కరాల సందర్భంగా అహర్నిశలు కృషి చేశారు. వారి కృషి , పట్టుదల అమోఘమన్నారు. పోలీసులు, విద్యుత్‌శాఖ అధికారులతో పాటు మిగతా శాఖల అధికారులు సైతం 24గంటలు, 12రోజులు శ్రమించారని అన్నారు. సరస్వతీ పుష్కరాల సందర్భం గా ప్రతీరోజు చాలెంజ్‌గా తీసుకుని ఎస్పీ కిరణ్‌ఖరే అన్నారు. ట్రాఫిక్ సమస్య తలెత్తినప్పటికీ వెంటనే దానిని పరిష్కారం చేశామని అన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశామని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, విజయలక్ష్మి, సింగరేణి జీఎం రాజేశ్వర్‌రెడ్డి, ఆర్టీసీ వరంగల్ ఆర్ఎం విజయభాను, ఆర్డీవో రవి, ఎస్పీ నరేష్, డీపీవో వీరభద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

మల్లంపల్లి ఇకపై జేడీ మల్లంపల్లి

గెజిట్ విడుదల చేసిన ప్రిన్సిపల్ సెక్రటరీ



ములుగు, మే 31(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లాలో నూతనంగా ఏర్పడిన మల్లంపల్లి మండలాన్ని జేడీ మల్లంపల్లిగా ధృవీకరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం గెజిట్ విడుదల చేసింది. ఈ మేరకు మల్లంపల్లి మండలాన్ని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ జడ్పీ చైర్మన్ దివంగత నేత కుసుమ జగదీష్ పేరిట జేడీ మల్లంపల్లిగా మార్చినందుకు మంత్రి సీతక్కకు మండల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ప్రతిపక్ష నాయకుడని చూడకుండా రాజకీయాలకు అతీతంగా కుసుమ జగదీష్ పేరిట మండలాన్ని ఏర్పాటు చేసినందుకు మల్లంపల్లి మండల సాధన సమితి సభ్యులు మంత్రి సీతక్కకు ధన్యవాదాలు తెలిపారు.

పచ్చిరొట్ట.. దిగుబడిలో దిట్ట..

- పచ్చిరొట్ట ఎరువులు.. పంటల దిగుబడులకు ప్రయోజనకారులు..
- సారవంతమవనున్న భూములు-పంటలకు అందనున్న పోషకాలు
- తొలకరితోనే విత్తుకోవాలంటున్న వ్యవసాయాధికారులు
- జిల్లాలో రైతులకు అందుబాటులో 2370 క్వింటాళ్ల జీలుగ, జనుము విత్తనాలు



జీలుగులు చల్లిన పొలంలో రైతు, జీలుగ విత్తనాల బస్తాలు

కాటారం, మే 31(ఆంధ్రజ్యోతి): పచ్చిరొట్ట.. పంట దిగుబడిలో ప్రధాన భూమిక పోషిస్తుంది. భూసారం పెంపులో దిట్ట. భూముల్లో రేగడి పోసుకునే కంటే నేల స్వభావానికి అనుగుణంగా పచ్చిరొట్ట ఎరువుతో సారవంతంగా మార్చుకోవచ్చని వ్యవసాయ శాఖ అధికారులు అంటున్నారు. పచ్చిరొట్ట సాగుతో భూమిలో ఉన్న చౌడును తొలగించి పంటలకు సూక్ష్మ, స్థూల పోషకాలను అందించి అధిక దిగుబడులకు తోడ్పడుతుందని డీఏవో వీరూ నాయక్ రైతులకు సూచిస్తున్నారు. పచ్చిరొట్ట ఎరువైన జీలుగ, జనుము విత్తనాలు వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు అందుబాటులో ఉన్నాయని, తొలకరి వర్షాలతో విత్తుకోవాలని డీఏవో తెలిపారు.. జిల్లాకు మొదటి విడతగా 1400క్వింటాళ్ల జీలుగ, 970 క్వింటాళ్ల జనుము విత్తనాలు వచ్చాయన్నారు. ఈ నేపథ్యంలో వానకాలం సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో, నైరుతి రుతుపవనాలు వ్యాపిస్తున్న క్రమంలో పచ్చిరొట్ట ఎరువులతో కలిగే ప్రయోజనాలపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

పచ్చి రొట్ట ఎరువులు అనగా..

వరి మాగాణి పొలంలో కోతల తర్వాత తొలకరి వర్షాలు పడగానే జీలుగ, జనుము, పిల్లి పెసర, ఇతర పప్పుజాతి గింజలను చల్లుకుని పచ్చి రొట్ట ఎరువులుగా వాడతారు. విత్తనాలను విత్తుకొని మొక్కలు పూత దశకు వచ్చేటప్పటికీ పొలంలోనే ట్రాక్టర్ కేజీవీల్స్ లేదా రోటావేటర్ సాయంతో కలియదున్ని బాగా మురిగేలా చేయడం జరుగుతుంది. దీన్నే పచ్చిరొట్ట ఎరువులను పొలాలకు అందించడం అంటారు.

పచ్చి రొట్టతో కలిగే ప్రయోజనాలు..

పచ్చి రొట్ట ఎరువులతో భూమి యొక్క భౌతిక, రసాయనిక మార్పులు అనుకూలంగా

మిగతా 8వ పేజీలో...

రాజనీతిశాస్త్రంలో నరేశ్‌గౌడ్‌కు డాక్టరేట్



కేయూ క్యాంపస్, మే 31 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ రాజనీతిశాస్త్ర విభాగం పరిశోధకుడు తాళ్లపల్లి నరేశ్‌గౌడ్ డాక్టరేట్ సాధించారు. ఈ మేరకు శనివారం వర్సిటీ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్ నరేశ్‌గౌడ్‌కు డాక్టరేట్ ప్రకటించారు 'స్టేట్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్- ఏ స్టడీ ఆఫ్ వరంగల్ డిస్ట్రిక్టు ఇన్ తెలంగాణ స్టేట్' అనే అంశంపై పరిశోధన చేసినందుకు నరేశ్‌గౌడ్ డాక్టరేట్ పొందారు. కేయూ రాజనీతిశాస్త్ర విభాగం ప్రొఫెసర్ పోరిక సమ్మూలాల్ పర్యవేక్షణలో నరేశ్‌గౌడ్ పరిశోధన పూర్తి చేశారు. జనగామ జిల్లా జఫర్‌గడ్ మండలం షాపల్లికి చెందిన నరేశ్‌గౌడ్ అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో విలువైన పరిశోధన పత్రాలను ప్రచురించారు. డాక్టరేట్ సాధించిన నరేశ్‌గౌడ్‌ను పాటు పలువురు అభినందించారు.

టూరిజంలో సరస్వతికి..



కేయూ క్యాంపస్, మే 31 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ చరిత్ర, టూరిజం విభాగం పరిశోధకురాలు బి.సరస్వతి డాక్టరేట్ సాధించారు. ఈ మేరకు శనివారం వర్సిటీ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్ సరస్వతికి డాక్టరేట్ ప్రకటించారు 'హిస్టోరికల్ మూమెంట్స్ డ్యూరింగ్ నిజాం పీరియడ్ ఇన్ తెలంగాణ- ఏ కేస్ స్టడీ ఫర్ టూరిజం డెవలప్‌మెంట్' అనే అంశంపై పరిశోధన చేసినందుకు గాను సరస్వతి డాక్టరేట్ పొందారు.

కేయూ హిస్టరీ, టూరిజం విభాగం అధ్యాపకుడు డాక్టర్ పి.సదానందం పర్యవేక్షణలో సరస్వతి పరిశోధన పూర్తిచేశారు. కాజీపేట ప్రాంతంలోని వెంకట్రాదినగర్ చెందిన సరస్వతి పరిశోధన పత్రాలను ప్రచురించారు. డాక్టరేట్ సాధించిన సరస్వతిని కేయూ సోషల్‌సైన్స్ డీన్ ప్రొఫెసర్ తాళ్ళపల్లి మనోహర్, సరస్వతి భర్త మదరి ప్రవీణ్‌కుమార్‌తో పాటు పలువురు అభినందించారు.

టీడబ్ల్యూజేప రాష్ట్ర అధ్యక్షుడిగా వెంకన్న




వడ్డెపల్లి, మే 31 (ఆంధ్రజ్యోతి): ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్టు అసోసియేషన్(టీడబ్ల్యూజేఏ) రాష్ట్ర కమిటీ ఎన్నిక శనివారం హనుమకొండలోని ఓ ప్రైవేటు సమావేశ మందిరంలో జరిగింది. టీడబ్ల్యూజేప రాష్ట్ర అధ్యక్షుడిగా హనుమకొండకు చెందిన బానోత్ వెంకన్న నాయక్, ప్రధాన కార్యదర్శిగా బానోత్ భగవాన్ నాయక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర అడ్వయిజర్‌గా మాజీ ఎంపీ ప్రొఫెసర్ అజ్మీరా సీతారాం నాయక్, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడిగా బాదావత్ బాలాజీ నాయక్, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడిగా తేజావత్ రవినాయక్, కోశాధికారిగా తేజావత్ భీముడు నాయక్‌లను ఎన్నుకున్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షులుగా లావుడ్య రాము నాయక్, బూర్క యాదగిరి, నన్నబోయిన లక్ష్మణ్ దొర, రాష్ట్ర సహాయ కార్యదర్శులుగా దేవరాజు ఏకాంబరం, బానోత్ వెంకన్న, ఇస్లావత్ రవీందర్‌తో పాటు రాష్ట్ర మహిళా కన్వీనర్‌గా ప్రియ, కోకన్వీనర్‌గా కల్యాణిలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు బానోత్ వెంకన్న నాయక్ మాట్లాడుతూ.. ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

జూన్ వచ్చే.. ఖర్చులు తెచ్చే..

సగటు జీవికి దబిడి దిబిడే..

హనుమకొండ సిటీ, మే 31 (ఆంధ్రజ్యోతి): జూన్ మాసం వచ్చేసింది. ఇక సగటు జీవికి ఆర్థిక దబిడి దిబిడే. పిల్లల స్కూల్ ఫీజులు తలుచుకుంటే ఫీజులు ఎగిరిపోయే పరిస్థితి. అంతేనా.. యూనిఫామ్, పుస్తకాలు ఇతరత్రా అవసరాల కొనుగోలు లెక్కలు వేసుకుంటునే గుండె బరువెక్కించే ఆర్థిక భారం. ఏటా జూన్ మాసం వచ్చేస్తుందంటే నిరుపేద, మధ్య తరగతి వర్గాలకు కంటికి నిద్ర పట్టదు. గుండెకు నెమ్మది ఉండదు. జూన్‌లో పాఠశాలలు తెరుచుకుంటున్నాయి. స్కూల్ ఫీజులు ఎంత?, యూనిఫామ్స్ ఖర్చు ఎంత అవుతుంది?, బిడ్డలకు కొత్తగా ఈ సారి యూనిఫామ్ కొనుగోలులాంటి ఖర్చులతో సతమతం అవుతున్నారు.

స్కూల్ ఫీజులు..



జూన్‌లో ప్రధానంగా సగటు మనిషిని ఆర్థికంగా కుదిపివేసే అంశం పిల్లల స్కూల్ ఫీజులు. ఫీజు ఒక్కటే కాదు.. యూనిఫామ్స్ కొనుగోలుకు సైతం వేలల్లోనే ఖర్చు భరించాల్సి వస్తోంది. ఇక కొన్ని పాఠశాలలు పుస్తకాలను కూడా విక్రయిస్తున్నాయి. మార్కెట్ ధరలతో సంబంధం లేకుండా వాత పెడుతున్నాయి. అనివార్యంగా తల్లిదండ్రులు అధిక ధరలను భరించి కొనుగోలు చేయాల్సిన పరిస్థితే. ఇక రవాణా సౌకర్యం కోసం స్కూల్ బస్సుల ఫీజు మోత. ఇవన్నీ లెక్కలు వేసుకునే సగటు జీవికి జూన్ మాసంలో దబిడి దిబిడే.

చేబదుళ్ల కోసం తంటాలు

పిల్లల ఫీజుల కోసం రెండు చేతుల సంపాదన ఉన్న కుటుంబాలు సైతం చేబదుళ్లు, వడ్డీకి రుణాలు తీసుకునే పరిస్థితే నెలకొంది. ముఖ్యంగా ప్రైవేటు స్కూల్ ఫీజుల విషయంలో నర్సరీలోనే రూ.35వేలకు పైగా చెల్లించాల్సి ఉంటుంది. ఇక కొంచెం పేరెన్నిక పాఠశాలలో అయితే ఫీజులు సగటు జీవికి పెనుభారంగానే మారాయి. ఇద్దరు పిల్లలకు ఫీజులు చెల్లించాల్సి వస్తే లక్ష రూపాయలకు పైగానే జూన్‌లో సమకూర్చుకోవాల్సిన పరిస్థితి. వీటికి తోడు ఇతరత్రా ఖర్చులు ఉండనే ఉన్నాయి. ఈ క్రమంలో నిరుపేద, మధ్య తరగతివర్గాలు చేబదుళ్లు, వడ్డీకి అప్పులు తీసుకునే పరిస్థితులు జూన్ మాసంలో అధికంగా ఉంటున్నాయి. అయితే చదువుల ఫీజులు నియంత్రిస్తామంటూ ప్రభుత్వం షరా మామూలుగానే చెప్పే మాటలు నీటి మూటలుగానే మారుతోంది.

సీజనల్ వ్యాధుల భయం

నిరుపేద, మధ్య తరగతి వర్గాలకు సీజనల్ వ్యాధుల ఖర్చులను కూడా జూన్ మాసం బెంబెలెత్తించనుంది. వర్షాలు కురుస్తుంటే చల్లదనంతో పాటు ఆ వెంటే రోగాల ఖర్చులు వచ్చిపడతాయనే భయం పట్టిస్తోంది. జూన్ మాసంలో రోగాలకు సైతం వేలల్లోనే ఖర్చు చేయాల్సి ఉంటుందని సగటు జీవులు ఆందోళనకు గురవుతున్నాయి. ఆస్పత్రుల ఖర్చులు ఊహించుకుంటూనే గుండె బరువెక్కిపోయే పరిస్థితి ఉందంటూ ఆవేదన చెందుతున్నాయి.

శుభకార్యాల ఖర్చు భారమే..

జూన్ మాసం శుభకార్యాలకు కూడా అనువుగా ఉండడంతో ఈ అంశం భారమే అంటున్నాయి నిరుపేద, మధ్య తరగతి వర్గాలు పెళ్లిలు ఇతనరత్రా కార్యక్రమాలు నిర్వహణ, వెళ్లాల్సి వచ్చినా లోటు బడ్జెట్‌తో దిక్కుతోచని స్థితే అంటున్నాయి.

ఎంతగా రాజీ పడినా..

జీవితంతో ఎంతగా రాజీపడినా జూన్ మాసం చేసే ఆర్థిక వికటాట్ట హాసంతో సగటుజీవి అతలాకుతలం అవుతున్నాడు. చివరకు ఇంట్లో ఉదయం పూట టిఫిన్, టీ, వీకెండ్ సెలబ్రేషన్స్‌ను త్యాగం చేసినా లోటు బడ్జెటే అంటూ సామాన్యవర్గాలు అసంతృప్తికి గురవుతున్నాయి. మొత్తంగా జూన్ మాసం సగటు జీవుకి ససేమిరా ఇష్టం లేనిదిగా మారింది.

రాణాలో మహిళ ఆత్మహత్యాయత్నం



మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళ వినోద

మహబూబాబాద్ క్రైం, మే 31 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట పోలీస్ స్టేషన్ ఓ వివాహిత శనివారం రాత్రి పురుగుల మందుతాగి ఆత్మ హత్యాయత్నానికి పాల్పడింది. వివరాల్లోకి వెళితే. నర్సింహులపేట మండల కేంద్రం శివారు పిచ్చిరాంతండాకు చెందిన భూక్య వినోదతో ములుగు జిల్లా మాన్‌సింగ్‌తండాకు చెందిన నూనావత్ నరేందర్‌తో నాలుగేళ్ల కిందట వివాహం జరిగింది. వీరి దాంపత్య జీవితం కొంత కాలం సజావుగా సాగినప్పటికీ ఏడాది కాలంగా ఇద్దరి మధ్యమనస్పర్థలు ఏర్పడి తరుచుగా ఘర్షణలు చోటు చేసుకుంటున్నాయి. పెద్ద మనుషుల సమక్షంలో పలు మార్లు పంచాయతీలు నిర్వహించారు. వారిద్దరు విడిపోవడానికి ఇష్టపడడంతో పెద్ద మనుషులు ఒక రీతిలో ఒప్పందం కుదిర్చారు. ఒప్పుకున్న డబ్బు ల్లో రూ.లక్ష వద్ద భార్యాభర్తల మధ్య అంగీకారం కుదరకపోవడంతో వినోద నర్సింహులపేట పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించారు. ఆమె మౌఖికంగా చెప్పారే తప్ప ఎలాంటి ఫిర్యాదు చేయలేదు. అయినప్పటి పోలీసులు కౌన్సిలింగ్ నిర్వహించి ఆమెకు న్యాయం చేద్దామని ప్రయత్నించారు. ఈ క్రమంలో భర్త నరేందర్ అంగీకరించకుండా అక్కడి నుంచి వెళ్లి పోవడంతో మనస్థాపానికి గురైన వినోద పోలీస్‌స్టేషన్‌లోనే తన వెంట తెచ్చుకున్న పురుగుల మందు తాగేందుకు యత్నించింది. గమనించిన పోలీసులు అప్రమత్తమై పురుగుల మందు డబ్బా లాక్కొని బాధితురాలు వినోదను 108 వాహనంలో మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ విషయంపై నర్సింహులపేట ఎస్సై సురేష్‌ను వివరణ కోరగా భార్యాభర్తల మధ్య అనేక సంవత్సరాలుగా తగవులున్నాయని వెల్లడించారు. బాధితురాలు వినోద ఎలాంటి ఫిర్యాదు చేయలేదని, మౌఖికంగా చెప్పడంతో తాము కౌన్సిలింగ్ నిర్వహించామన్నారు. భర్త నరేందర్ వినకుండా వెళ్లి పోవడంతో వినోద క్షణికావేశంలో పురుగులు మందు తాగేందుకు యత్నించిందని, వెంటనే 108 ద్వారా జిల్లా ఆస్పత్రికి తరలించామని వివరణ ఇచ్చారు.

మగ్గం వర్క్స్, టైలరింగ్‌లో మహిళలకు ఉచిత శిక్షణ

హసన్‌పర్తి, మే 31(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ మహిళలకు జర్దోషి మగ్గం వర్క్స్, టైలరింగ్‌లో 31 రోజుల పాటు ఉచిత శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు భారతీయ స్టేట్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ డైరెక్టర్ బాస రవి తెలిపారు. వరంగల్ రూరల్, హనుమకొండ, ప్రొఫెసర్ జయశంకర్ భూపాలపల్లి, జనగామ, ములుగు, మహబూబాబాద్ జిల్లాలకు చెందిన 18 నుంచి 45 ఏళ్లలోపు కలిగిన మహిళలు అర్హులని తెలిపారు. జూన్ 9వ తేది నుంచి ప్రారంభంకానున్న శిక్షణ తరగతులకు ఆసక్తి కలిగిన అభ్యర్థులు జూన్ 9లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి సదుపాయం, కోర్స్ మెటీరియల్‌తోపాటు శిక్షణ పూర్తిచేసిన అభ్యర్థులకు యోగ్యతా సర్టిఫికెట్ కూడా ఇస్తామన్నారు. ఇతర వివరాలకు భారతీయ స్టేట్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ సంస్కృతి విహార్, టీటీడీసీ హసన్‌పర్తి, వరంగల్ జిల్లా 9704056522, 9849307873, 6281260878, 9949108934 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

భద్రకాళి అమ్మవారి రాజ గోపురానికి భూమి పూజ

వరంగల్ కల్చరల్, మే 31 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధిగాంచిన భద్రకాళి అమ్మవారి దేవస్థానం అభివృద్ధి పనుల్లో భాగంగా మరో అడుగు ముందుకు పడింది. ఇప్పటికే కొనసాగుతున్న అమ్మవారి మాఢ వీధుల నిర్మాణంతోపాటు నూతనంగా రాజగోపాపురాల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఇందుకోసం ఈ నెల 5న భూమి పూజ చేయాలని నిర్ణయించారు. వీటితోపాటు నిత్య అన్నదాన సత్రం, ఈవో కార్యాలయం, వేద పాఠశాల నూతన భవన నిర్మాణంతోపాటు అర్చక కుటీరాల నిర్మాణానికి భూమి పూజ చేయాలని దేవస్థాన అధికారులు నిర్ణయించినట్లు తెలిసింది. ఈ నెల 5న గురువారం రోజున జరిగే భూమి పూజ కార్యక్రమానికి దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, దేవాదాయ శాఖ కమిషనర్‌తోపాటు పలువురు హాజరు కానున్నట్లు తెలిసింది.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కాజీపేట, మే 31 (ఆంధ్రజ్యోతి): వడ్డెపల్లిలోని చెరువులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని కాజీపేట పోలీసులు శనివారం కనుగొన్నారు. సుమారు 50 నుంచి 60 ఏళ్ల వయస్సు గల గుర్తుతెలియని వ్యక్తి మృతి చెంది ఉన్నట్లు చెప్పారు. మృతదేహాన్ని వెలికితీసి వరంగల్ ఎంజీఎం మార్చురీకి తరలించినట్లు చెప్పారు. ఎవరైనా గుర్తించినట్లయితే కాజీపేట పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

ఐదు జిల్లాల్లో రూ.540 కోట్ల పొదుపు నిధులు

సంఘాల్లోని రుణాల వివరాలు ఆన్‌లైన్‌లో.. ● రుణాలు తీసుకున్న వారికి ఎస్‌ఎంఎస్‌లు ● సహకార వికాస సంస్థ కోశాధికారి రేవతి



మాట్లాడుతున్న సహకార వికాస సంస్థ కోశాధికారి రేవతి

భీమదేవరపల్లి, మే 31 (ఆంధ్రజ్యోతి): మహిళా, పురుష పొదుపు సంఘాల్లోని ఐదు జిల్లాల్లోని సభ్యులకు రూ.540 కోట్ల పొదుపు నిధులు ఉన్నాయని సహకార వికాస సంస్థ కోశాధికారి ఎర్రబెల్లి రేవతి అన్నారు. శనివారం భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లో పురుషుల పొదుపు సమితి అధ్యక్షుడు జాన ప్రవీణ్ ఆధ్వర్యంలో 25వ వార్షిక సిల్వర్ జూబ్లీ ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం ఆర్థిక లావాదేవీలను సమితి గణకులు నీలం భిక్షపతి, రాజ్‌కుమార్ చదివి వినిపించారు. అనంతరం రేవతి మాట్లాడుతూ.. కరీంనగర్, హనుమకొండ, వరంగల్, జనగామ, సిద్ధిపేట జిల్లాల్లో 570 మహిళా, పురుషుల పొదుపు సంఘాలు ఉన్నాయన్నారు. వీటిలో 2.70 లక్షల మంది సభ్యులు ఉన్నారని తెలిపారు. రూ.540 కోట్ల ఆర్థిక లావాదేవీల నిధులు ఉన్నాయన్నారు. ఇక నుంచి సభ్యులు తీసుకున్న రుణాల వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నామన్నారు. అలాగే ఎలాంటి అవకతవకలకు పాల్పడకుండా సభ్యులు తీసుకున్న రుణాలను ఎస్ఎంఎస్ ద్వారా సమాచారం అందించే వ్యవస్థను రూపొందిస్తున్నామని చెప్పారు. ఈసందర్భంగా సంఘాల్లో డిజిటల్ లావాదేవీలు నిర్వహించాలని వివిధగ్రామాలకు చెందిన సభ్యులు కోరారు.

సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు రాజిరెడ్డి మాట్లాడుతూ.. 1990లో పొదుపు ఉద్యమం చేపట్టామన్నారు. నేడు పొదుపు ఉద్యమాల్లో రూ.500 కోట్లకు పైగా నిధులు జమ కావడం తమకు ఎంతో సంతృప్తిని ఇస్తోందన్నారు. 25వ వార్షికోత్సవాలను పూర్తి చేసుకొని సిల్వర్‌జూబ్లీ వేడుకలు నిర్వహిస్తున్నందుకు పలువురు సమితి అధ్యక్షుడిని ఘనంగా సన్మానించారు. సమితి అధ్యక్షుడిగా జాన ప్రవీణ్, ఉపాధ్యక్షుడిగా నల్లగోని రమేష్, సమితి-2 అధ్యక్షుడిగా నరాల తిరుపతిరెడ్డి, సల్పాల సురేందర్‌రెడ్డిలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు జాన ప్రవీణ్, కొత్తకొండ సమితి అధ్యక్షుడు గాజుల సతీష్, వ్యవస్థాపక అధ్యక్షుడు రాజిరెడ్డి, సహకార వికాస సంస్థ డీవో సుమలత, డీఏ ఈశ్వర్, సమితి ఉపాధ్యక్షుడు దొంతరవేణి రవీందర్, పాలకవర్గ సభ్యులు నాయిని తిరుపతి, నరాల తిరుపతిరెడ్డి, రమేష్, కుమారస్వామి, సురేందర్, మురళి, ధర్మారెడ్డి, నరేందర్‌రెడ్డి, స్వామి, ప్రభాకర్, మురళీకృష్ణ, సంపత్‌రెడ్డితో పాటు సభ్యులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్‌రెడ్డి

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్‌రెడ్డి

వరంగల్ ఎడ్యుకేషన్, మే 31(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉపాధ్యాయులంతా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే దిశగా కృషి చేస్తూ విద్యార్థులకు విద్యాబోధన చేయాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్‌రెడ్డి సూచించారు. హనుమకొండ భీమారంలోని స్కిల్‌స్టోర్క్ స్కూల్లో నిర్వహించిన ఉపాధ్యాయుల శిక్షణ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంపొందించేందుకు నిబద్ధులై ఉండాలన్నారు. ఉపాధ్యాయుల సమస్యలు, విద్యారంగ సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంవో ఎ.శ్రీనివాస్, ఉపాధ్యాయులు విజయ్‌మోహన్, మధుసూదనరెడ్డి, భద్రయ్య, ప్రసాద్, అజయ్, అలీ, శశికళాధర్, శివకుమార్, సంపత్, శీను, విద్యానంద్, రవి, రఘు తదితరులు పాల్గొన్నారు.

తెగిపడిన ఓహెచ్‌ఈ వైరు

పలు రైళ్ల రాకపోకలకు అంతరాయం



డోర్నకల్‌లో కృష్ణా ఎక్స్‌ప్రెస్

డోర్నకల్,మే 31 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్‌జిల్లాలోని డోర్నకల్-గార్ల రైల్వే స్టేషన్ల మధ్య ఎగువలైన్‌పై ఓవర్ హెడ్ ఎక్విప్‌మెంట్ (ఓహెచ్‌ఈ) వైరు తెగిపడడంతో పలు రైళ్ల రాకపోకలకు శనివారం సాయంత్రం అంతరాయం ఏర్పడింది. దీంతో తిరుపతి నుంచి ఆదిలాబాద్ వెళ్లే కృష్ణాఎక్స్‌ప్రెస్‌ను గంటకు పైగా డోర్నకల్ రైల్వేస్టేషన్‌లో నిలిపివేశారు. ఓహెచ్‌ఈ సిబ్బంది టవర్‌కార్‌తో వెళ్లి మరమ్మతులు నిర్వహించిన అనంతరం రైళ్ల రాకపోకలు ప్రారంభమయ్యాయి. రైళ్లు ఆగిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

కేడీసీలో రెండో విడత దోస్త్ అడ్మిషన్లు

కేయూ క్యాంపస్, మే 31 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అటానమస్‌లో మే 30 నుంచి జూన్ 8 వరకు రెండో విడత దోస్త్ ఆన్‌లైన్ ప్రక్రియలో అడ్మిషన్లు కల్పిస్తున్నట్లు కేడీసీ ప్రిన్సిపాల్ డాక్టర్ గుర్రం శ్రీనివాస్ తెలిపారు. బీఏ హెచ్‌ఈపీ, ఈపీపీ, హెచ్‌పీపీ, కంప్యూటర్ సైన్స్, సైకాలజీ, జర్నలిజం, బీకాం కంప్యూటర్స్, బ్యాంకింగ్ సర్వీసెస్, బిజినెస్ అనలైటిక్స్, బీబీఏ అడ్మినిస్ట్రేషన్, రిటైల్ ఆపరేషన్స్, బీసీఏ, బీఎస్సీ ఎంపీసీ డాటాసైన్స్, హానర్స్, ఎలక్ట్రానిక్స్, స్టాటిస్టిక్స్, జియాలజీ, ఇంగ్లీష్ మీడియం కోర్సుల్లో సీట్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. దోస్త్‌లో జూన్ 8వరకు రిజిస్ట్రేషన్ చేసుకుని కేడీసీకి వెబ్ ఆప్షన్లు ఇవ్వాలని విద్యార్థులను కోరారు. కళాశాలలో అడ్మిషన్లపై ఏదైనా సందేహాలు ఉంటే కళాశాల దోస్త్ కోఆర్డినేటర్ ఎం.రవికుమార్ సెల్ 99633-10073 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

టీచర్ల సర్దుబాటు ప్రక్రియను వెనక్కి తీసుకోవాలి

వరంగల్ ఎడ్యుకేషన్, మే 31 (ఆంధ్రజ్యోతి): టీచర్లను సర్దుబాటు చేయాలంటూ రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ జారీ చేసిన ఉత్తర్వులను వెంటనే వెనక్కి తీసుకోవాలని వివిధ ఉపాధ్యాయ సంఘాల నేతలు శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. విద్యారంగాన్ని బలోపేతం చేస్తామంటూనే పాఠశాలల్లో ఉపాధ్యాయులను కుదించేందుకు ఉత్తర్వులు జారీ చేయడాన్ని వారు తప్పుబట్టారు. ఉపాధ్యాయుల సర్దుబాటుతో ప్రాథమిక పాఠశాలలు నిర్వీర్యమయ్యే ప్రమాదముందని వారు పేర్కొన్నారు. పాఠశాలల్లో ఉపాధ్యాయుల సంఖ్య తగ్గడంవల్ల ప్రతీ సబ్జెక్టులో విద్యాబోధన జరగదని తెలిపారు. పాఠశాలలు ప్రారంభం కాకముందే ఎలా సర్దుబాటు చేస్తారని వారు ప్రశ్నించారు. విద్యార్థుల ప్రవేశాలను, సంఖ్యకు అనుగుణంగా మాత్రమే ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియను చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. ప్రకటన విడుదల చేసిన వారిలో డీటీఎఫ్ నుంచి ఎ.శ్రీనివాస్‌రెడ్డి, జి.ఉప్పలయ్య, కె.శ్రీనివాస్, టీపీటీఎఫ్ నుంచి ఎస్. తిరుపతి, జి.సత్యనారాయణ, ఎం.రఘుపతి, కుమారస్వామి, లక్ష్మయ్య, రమేష్, భిక్షపతి, సదానందం, భాస్కర్ ఉన్నారు.

పదేళ్లలో సబ్‌ప్లాన్ నిధులు ఖర్చు చేయలేదు

- మేం వచ్చాక 17,169కోట్ల కేటాయింపు
- గిరిజనుల హక్కులు కాపాడేలా నల్లమల్ల డిక్లరేషన్ ఇచ్చాం: భట్టి విక్రమార్క
- గిరిజనుల హక్కులను రక్షించాలి: మీనాక్షి

కొత్తగూడెం, మే 31 (ఆంధ్రజ్యోతి): గత పదేళ్లలో రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్ సర్కారు గిరిజనుల కోసం సబ్‌ప్లాన్ నిధులను ఏ మాత్రం ఖర్చు చేయలేదని, తాము అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.17,169కోట్లను కేటాయించామని డిప్యూటి సీఎం మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలోని కిన్నెరసానిలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న కాంగ్రెస్ తెలంగాణ ఆదివాసీ కార్యకర్తల సమ్మేళనం ముగింపు సమావేశం శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. ప్రజాప్రభుత్వంలో సబ్‌ప్లాన్ నిధులను పారదర్శకంగా ఖర్చు చేస్తున్నామని చెప్పారు. గిరిజనుల అవసరాలేంటో తెలుసుకునేందుకు ఆ వర్గాలకు చెందిన నాయకులను ఒకచోట చేర్చి శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేశామన్నారు. అడవి బిడ్డలు ఆత్మగౌరవంతో జీవించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఇందిరా సౌర జల గిరిజన వికాస పథకం తీసుకొచ్చిందని వెల్లడించారు. గిరిజనుల హక్కులు, ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు నల్లమల్ల డిక్లరేషన్ తీసుకొచ్చినట్లు ఆయన తెలిపారు. కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నాటరాజన్ మాట్లాడుతూ.. గిరిజనుల చట్టాలను, హక్కులను పరిరక్షించి వారిని అన్నిరంగాల్లో ముందు వరుసలో నిలపాలన్నారు. గిరిజనులకు రాజ్యాంగం కల్పించిన హక్కులన్నీ పరిరక్షించినప్పుడే వారు అభివృద్ధిలో ముందుకు వెళ్తారని, దీనికోసం కాంగ్రెస్ ఎల్లప్పుడు కృషి చేస్తుందన్నారు. పోడు భూముల్లో సాగు చేసుకుని జీవనం సాగించేందుకు అడవి బిడ్డలకు ఆర్థికంగా చేయూతనందించాలనిసూచించారు. పీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేష్‌గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత గిరిజనుల అభివృద్ధి, వారి సంక్షేమం కోసం రూ.కోట్లాది నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. నాడు ఇందిరాగాంధీ నుంచి ఇప్పటి సోనియాగాంధీ వరకు గిరిజనుల అభివృద్ధికోసం,వారిని అన్నిరంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు విశేషంగా కృషి చేశారని పేర్కొన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ గిరిజనుల అభివృద్ధికి, సంక్షేమానికి పెద్దపీట వేస్తామని తెలిపారు.


పాల్వంచలో ఆదివాసీ కాంగ్రెస్ కార్యకర్తల సమ్మేళనంలో మాట్లాడుతున్న భట్టి

రాష్ట్రంలో విలువైన ప్రభుత్వ భూములను కాపాడేందుకు భూభారతి చట్టాన్ని తీసుకొచ్చామని తెలిపారు.

ప్రభుత్వ పనితీరుపై మీనాక్షి ఆరా

ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలతో మీనాక్షి నటరాజన్ శనివారం పాల్వంచలోని జెన్కో అతిథిగృహంలో అంతర్గత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మీనాక్షి నటరాజన్ ఒక్కో ఎమ్మెల్యేతో వేర్వేరుగా మాట్లాడి.. వారి నియోజకవర్గాల్లో రాజకీయ పరిస్థితులు, కాంగ్రెస్ ప్రభుత్వ పని తీరుపై ప్రజల్లో ఉన్న అభిప్రాయాలు, తదితర వివరాలను అడిగి తెలుసుకున్నట్టు సమాచారం. ఈ క్రమంలో ఆయా ఎమ్మెల్యేలు ప్రభుత్వ పని తీరు బాగానే ఉందని, రుణమాఫీ, రైతు బంధు పథకం అందరికీ అందలేదన్న వ్యతిరేకత కొంత ఉందని ఆమె వివరించినట్టు తెలిసింది.

కొందరు బీజేపీ సీనియర్లతో కేసీఆర్‌కు సంబంధాలు



- ఆ కారణంగానే పార్టీ అధ్యక్ష పదవి నుంచి బండిని తప్పించారు
- గత ఎన్నికల్లో కేసీఆర్ చెప్పిన వారే బీజేపీ అభ్యర్థులు: మహేశ్ గౌడ్

కొత్తగూడెం, మే 31 (ఆంధ్రజ్యోతి): బీజేపీ, బీఆర్ఎస్ మధ్య లోపాయికారి ఒప్పందం కుదిరిందని, కొందరు బీజేపీ సీనియర్ నాయకులతో కేసీఆర్‌కు సంబంధాలున్నాయని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. ఆ సంబంధాల కారణంగానే బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి బండి సంజయ్‌ను తొలగించారన్నారు. రేపో.. మాపో.. బీజేపీలో బీఆర్ఎస్ విలీనం కావడం ఖాయమని జోస్యం చెప్పారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలోని కిన్నెరసాని గురుకుల పాఠశాల ఆవరణలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆదివాసీ గిరిజన కాంగ్రెస్ సమ్మేళనం ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం విలేకరులతో మహేశ్ గౌడ్ మాట్లాడారు. 'బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ చెప్పినట్టే గత ఎన్నికల్లో కేసీఆర్ చెప్పినట్టుగానే బీజేపీ తమ అభ్యర్థులను నిలబెట్టింది. బీజేపీకి తెలంగాణలో పునాదులు లేవు.. ఆ పార్టీ ఇక్కడ అధికారంలోకి రావడం కలే.. రాష్ట్రంలో కాంగ్రెస్ బలంగా ఉంది. అన్ని వర్గాల ప్రజలకు చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలతో పార్టీ బలోపేతమవుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల వల్ల.. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తప్పనిసరిగా కాంగ్రెస్ 90 సీట్లు గెలుచుకుంటుంది' అని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్.. ఒక్కటేనని బీజేపీ నేతలు చేస్తున్న ఆరోపణల్లో ఏ మాత్రం నిజం లేదని కొట్టిపారేశారు. బండి సంజయ్ మాటలను ప్రజలు నమ్మడం లేదని, ఆయన ఇంకా యువ మోర్చా నాయకుడిలా మాట్లాడటం సరికాదన్నారు.

అధికారంలో ఉన్నా లేకున్నా తెలంగాణ అభివృద్ధే లక్ష్యం: కేటీఆర్

హైదరాబాద్, మే 31(ఆంధ్రజ్యోతి): అధికారంలో ఉన్నా లేకున్నా తెలంగాణ అభివృద్ధి చెందాలన్నదే తమ అభిమతమని, పెట్టుబడుల కోసం ప్రయత్నిస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. ఇంగ్లాండ్‌లోని వార్విక్ యూనివర్సిటీలో ప్రాగ్మటిక్ డిజైన్ సొల్యూషన్స్ లిమిటెడ్ (పీడీఎస్ఎల్) నాలెడ్జ్ సెంటర్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దిగ్గజ కార్పొరేట్ సంస్థలకు తెలంగాణ బిడ్డలు సేవలందించడం గర్వకారణం అన్నారు. పెట్టుబడులు వచ్చి తెలంగాణ యువతకు ఉపాధి అవకాశాలు దొరకాలని, అందుకోసం సర్వశక్తులు ఉపయోగిస్తామని చెప్పారు.

కేసీఆర్‌కు నోటీసులంటే.. తెలంగాణకు ఇచ్చినట్లే

ఆయనపై ఈగ వాలినా ఊరుకోం.. కాళేశ్వరం కమిషన్ నోటీసులకు వ్యతిరేకంగా 4న ఇందిరాపార్క్ వద్ద ధర్నా

- జాగృతి నూతన కార్యాలయం ప్రారంభం

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ అధినేత కేసీఆర్.. తెలంగాణ జాతిపిత అని, ఆయనకు నోటీసులు ఇవ్వడమంటే యావత్తు తెలంగాణకు నోటీసులిచ్చినట్లేనని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. కేసీఆర్‌పై ఈగ వాలినా తాము ఊరుకోబోమని హెచ్చరించారు. కేసీఆర్‌కు బీఆర్ఎస్ పార్టీ ఒక కన్ను అయితే.. తెలంగాణ జాగృతి మరో కన్ను అని తెలిపారు. కాళేశ్వరం కమిషన్ కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వడాన్ని నిరసిస్తూ ఈ నెల 4న ఇందిరా పార్కు వద్ద మహాధర్నా చేపడుతున్నట్లు ప్రకటించారు. శనివారం బంజారాహిల్స్‌లోని తన నివాసం సమీపంలో తెలంగాణ జాగృతి నూతన కార్యాలయాన్ని కవిత ప్రారంభించారు. కుటుంబ సమేతంగా పూజలు నిర్వహించిన అనంతరం బీఆర్ అంబేద్కర్, మహాత్మా జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే, ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాలకు పుష్పాంజలి ఘటించారు. అనంతరం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గోదావరి జలాల్లో 200 టీఎంసీల హక్కు తెలంగాణకు ఉండాలని కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు కట్టారని తెలిపారు. "కాళేశ్వరం ద్వారా ఏటా 20 లక్షల ఎకరాలకు నీళ్లు అందించినందుకు కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చారా? కోటి ఎకరాల మాగాణంగా తెలంగాణను చేసిందుకు నోటీసులు ఇచ్చారా ? రైతు బీమా, రైతు బంధు పథకాలను ప్రవేశపెట్టినందుకు ఇచ్చారా? తెలంగాణ ప్రజలకు మేలు చేసినందుకు ఇచ్చారా? అది కాళేశ్వరం కమిషనా? లేక కాంగ్రెస్ కమిషనా?"అని కవిత ధ్వజమెత్తారు. కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వడం పట్ల ప్రతి తెలంగాణ బిడ్డ బాధపడుతున్నారని అన్నారు.

నీళ్లు తరలించుకుపోతుంటే మాట్లాడరేం?

ఏపీ సీఎం చంద్రబాబు బనకచర్ల ప్రాజెక్టు నిర్మించి తెలంగాణ నీళ్లను తరలించుకుపోతుంటే సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడని పరిస్థితి ఏర్పడిందని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం అంత బలహీనంగా ఎందుకున్నారని, పక్క రాష్ట్రాల ప్రయోజనాల కోసం ఎందుకు పనిచేస్తున్నారని ప్రశ్నించారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు నదుల అనుసంధానాన్ని తుపాకులగూడెం నుంచి చేపట్టేలా ప్రతిపాదించారని, కానీ.. ఆనాడు కేంద్ర ప్రభుత్వం ఒప్పుకోకుండా ఇచ్చంపల్లి నుంచి చేపడతామని చెప్పిందని అన్నారు. కానీ, ఇప్పుడు పోలవరం నుంచి 200 టీఎంసీల గోదావరి నీళ్లను తరలించే ప్రయత్నం జరుగుతోందని తెలిపారు. జూన్ 2 నాడు సీఎం రేవంత్‌రెడ్డి ఈ అంశంపై స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి కనీసం జై తెలంగాణ అనకపోవడం మన ఖర్మ అని, తెలంగాణ గ్రహచారం బాగాలేక రాష్ట్రానికి రేవంత్‌రెడ్డి సీఎం అయ్యారని కవిత వ్యాఖ్యానించారు. జై తెలంగాణ అనని వారికి, అమరవీరులకు నివాళులర్పించని వారికి సీఎం కుర్చీలో కూర్చొనే అర్హత లేదన్నారు. ఇప్పటికైనా రేవంత్ జై తెలంగాణ అనాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ పిడికిలెత్తి బయటికి వస్తేనే తెలంగాణ వచ్చిందని, దానివల్లే ఇవాళ అధికారంలో ఉన్నామన్న విషయాన్ని వారు గుర్తుంచుకోవాలని హితవు పలికారు. ఆ విషయాన్ని మరిచిపోయి కేసీఆర్‌కు నోటీసులివ్వడం దారుణమన్నారు. యువతకు స్వయం ఉపాధి కోసం ప్రారంభిస్తున్న రాజీవ్ యువ వికాసం


జాగృతి కార్యాలయ ప్రారంభోత్సవం సందర్భంగా పూజలు చేస్తున్న కవిత

పథకం పేరు మార్చాలని డిమాండ్ చేశారు. తెలంగాణకు ఎటువంటి సంబంధంలేని రాజీవ్‌గాంధీ పేరు పెట్టడం సరికాదన్నారు. అమరులు శ్రీకాంతచారి, యాదిరెడ్డి, ప్రజాకవి కాళోజీ, మాజీ ప్రధాని పీవీ నరసింహారావు పేరు పెట్టాలని సూచించారు. రాష్ట్ర శాసనసభ, శాసన మండలి ఆమోదించిన బీసీ బిల్లులను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆమోదించకుండా తాత్సారం చేస్తోందని కవత మండిపడ్డారు. ఇటీవల ప్రధాని మోదీని సీఎం రేవంత్ రెడ్డి కలిసిన సమయంలో ప్రాజెక్టుల గురించి మాట్లాడారు తప్ప.. బీసీ బిల్లు మీద మాట్లాడలేదని ఆరోపించారు. బీసీ బిల్లును డీప్ ఫ్రిడ్జ్‌లో పెట్టే ప్రయత్నం చేస్తే బీజేపీకి సెగ తాకేలా పోరాటం చేస్తామని హెచ్చరించారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించే వరకు జాగృతి పోరాటం చేస్తుందని అన్నారు.

జాగృతి కమిటీల ఏర్పాటు..

మైనారిటీల హక్కుల కోసం కూడా జాగృతి పోరాటం చేస్తుందని కవిత ప్రకటించారు. జాగృతిలో మైనారిటీల హక్కల కోసం ముస్లిం, సిక్కు, క్రిస్టియన్ విభాగాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. జాగృతి తరఫున ఎస్సీ, ఎస్టీ విభాగాన్ని ఏర్పాటు చేసి ఆ వర్గాల కోసం ఉద్యమిస్తామన్నారు. అయితే, తాము పోరాటాలు చేస్తుంటే కొంతమంది ఓర్వడం లేదన్నారు. తెలంగాణ కోసం బీజేపీ నాయకులు మాట్లాడకపోవడం దారుణమని, 8మంది ఎంపీలను గెలిపించినా కేంద్రం నుంచి రూపాయి తీసుకురాలేదని విమర్శించారు. గోదావరి జలాల్లో తెలంగాణ వాటాను కాపాడకపోతే తెలంగాణ జాగృతి పవర్ చూపిస్తామన్నారు. కాగా, తెలంగాణ జాగృతి కార్యాలయ కార్యదర్శిగా పొన్నమనేని బాలాజీరావును నియమిస్తున్నట్లు ఆ కార్యాలయం తెలిపింది.

బీజేపీతో పొత్తు ఉంటుందని ఏమార్చారు

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మాతో టచ్‌లోకి.. వచ్చినప్పుడల్లా కేసీఆర్ ఇదే చెప్పారు: సంజయ్



కరీంనగర్, మే 31(ఆంధ్రజ్యోతి, ప్రతినిధి): గతంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఆ పార్టీలోని చాలా మంది ఎమ్మెల్యేలు బీజేపీతో టచ్‌లోకి వచ్చారని.. అలా జరిగిన ప్రతిసారీ కేసీఆర్ ఎమ్మెల్యేలతో సమావేశమై కమలంతో పొత్తు పెట్టుకుంటామని చెప్పి వారిని కాషాయ గూటికి రాకుండా చేశారని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. బీఆర్ఎస్ అంటేనే అవినీతి పార్టీ అని, కవితను అరెస్టు చేయకుండా ఉండటానికి బీజేపీతో కలవడానికి బీఆర్ఎస్ ప్రయత్నించిందని చెప్పారు. కుటుంబ పార్టీని తాము దగ్గరకు రానివ్వలేదని తెలిపారు. శనివారం కరీంనగర్‌లో సంజయ్ విలేకరులతో మాట్లాడారు. ఈటల రాజేందర్, హరీశ్‌రావు భేటీ విషయం తెలియదని, ఇదంతా కాంగ్రెస్ ఆడుతున్న డ్రామా అని తెలిపారు. కవిత విషయంలోనూ అదే డ్రామా నడుస్తోందని చెప్పారు కల్వకుంట్ల ఆర్ట్స్ క్రియేషన్స్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నిర్మాణ దర్శకత్వంలో కవిత పాత్రధారిగా చార్‌పత్తా సినిమా నడుస్తోందన్నారు. కవిత ఎపిసోడ్‌తో ప్రజలకు మేలు జరుగుతుందా..? అని ప్రశ్నించారు. ఆరు గ్యారెంటీలపై చర్చ జరగకుండా చిట్‌చాట్‌ల పేరుతో ప్రజల దృష్టిని మళ్లించే కుట్ర జరుగుతోందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు ముమ్మాటికీ దేశద్రోహమే అని సంజయ్ అన్నారు. సైన్యం ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేలా, పాకిస్తాన్ ఉగ్రవాదులను పెంచి పోషించేలా ఆయన వ్యాఖ్యలు ఉన్నాయని మండిపడ్డారు. బీఆర్ఎస్ అవినీతి, కాళేశ్వరం ప్రాజెక్టు, డ్రగ్స్, ఫోన్ ట్యాపింగ్, ఫాంహౌస్, ఫార్ములా-ఈ రేసు కేసుల విషయంలో అరెస్టులు ఉంటాయని చెప్పి కాంగ్రెస్ మాట తప్పిందని అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి బీజేపీని అధికారంలోకి రాకుండా అడ్డుకోవాలని చూస్తున్నాయని, వాళ్లెన్ని కుట్రలు చేసినా అది జరగదని చెప్పారు. వేములవాడ రాజన్న ఆలయ పరిధిలో 18 గోవులు చనిపోవడంపై అధికారులు వ్యవహరిస్తున్న తీరు సరికాదని సంజయ్ అన్నారు.

పీడిత జన పక్షపాతి డీవీ


తొలి తరం కమ్యూనిస్టు నేత, కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతల్లో ఒకరు, జనం నుంచి వచ్చిన అసలు సిసలు జన నేత దేవులపల్లి వెంకటేశ్వర్ రావు(డీవీ). తాను నమ్మిన సిద్ధాంతాన్ని ఆచరణలో చూపించారు. 40 ఏళ్లకుపైగా కమ్యూనిస్టు ఉద్యమాల్లో పని చేసిన అనుభవం అందులో 17 ఏళ్ల అజ్ఞాత జీవితం ఆయన సొంతం. కమ్యూనిస్టు పార్టీ సెక్రటేరియల్ సభ్యుడు. నల్లగొండ జిల్లా పార్టీ కార్యదర్శిగా పని చేశారు. 1951 వరకు జరిగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి గుండెలాంటి నల్లగొండ జిల్లా పార్టీ సారథిగా అటు పోరాటంలోనూ, ఇటు సిద్ధాంత చర్చల్లోనూ అగ్రభాగాన నిలిచారు. నేడు (జూన్ 1) దేవులపల్లి వెంకటేశ్వరరావు జయంతి సందర్భంగా ప్రత్యేక కథనం..

- తెలంగాణ సాయుధ పోరాట యోధుడు
- కమ్యూనిస్టు పార్టీ తొలితరం నేత
- 17 ఏళ్లు అజ్ఞాతవాసం గడిపిన నాయకుడు
- కమ్యూనిస్టు సిద్ధాంతకర్త, రచయిత
- పోరుగల్లుకు వన్నె తెచ్చిన ఉద్యమ శిఖరం
- నేడు దేవులపల్లి వెంకటేశ్వర్‌రావు జయంతి

హనుమకొండ, మే 31 (ఆంధ్రజ్యోతి): దేవులపల్లి వెంకటేశ్వర్ రావు 1917 జూన్ 1న మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తిలో జన్మించారు. జనగామతో పాటు నల్లగొండ జిల్లాతో ఆయన ఉద్యమ జీవితం ఎక్కువగా పెనవేసుకుపోయింది. సంపన్న భూస్వామ్య కుటుంబంలో జన్మించారు. బాల వితంతువైన రంగమ్మను వివాహం చేసుకున్నారు. దేవులపల్లి ప్రాథమిక విద్యాభ్యాసం నల్లగొండ జిల్లా చందుపట్ల సమీపంలోని తిరుమలగిరి, నామవరం గ్రామాల్లో, మాధ్యమిక విద్య సూర్యాపేట, హైస్కూల్ చదువు వరంగల్‌లో సాగింది. ప్రజా ఉద్యమాల్లో చురుకుగా పాల్గొంటున్నందుకు ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి బహిష్కరణకు గురికావడంతో జబల్పూర్ వెళ్లి అక్కడ బీఏ డిగ్రీ పూర్తి చేశారు. అక్కడే జాతీయోద్యమం, కమ్యూనిస్టు సాహిత్యంతోనూ పరిచయం ఏర్పడింది.

17 ఏళ్లు అజ్ఞాత జీవితం

జబల్‌పూర్ నుంచి స్వగ్రామానికి తిరిగి వచ్చిన తర్వాత 1939లో కమ్యూనిస్టు పార్టీలో చేరారు. అప్పటికే నిజాం పాలనలో కమ్యూనిస్టు పార్టీపై నిషేధం ఉంది. హైదరాబాద్‌లో కామ్రేడ్స్ అసోసియేషన్ నిర్మాతల్లో ఆయన ప్రథములు. 1941-51 మధ్య ఉద్యమం సాయుధ పోరాట రూపం తీసుకున్న సమయంలో నల్లగొండ జిల్లా పార్టీ బాధ్యతలు చేపట్టారు. పోరాట విరమణ తర్వాత 1957లో నల్లగొండ నియోజకవర్గం నుంచి పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఆయన తన మొత్తం వ్యవసాయ భూములను కౌలుదారులకే ఇచ్చేశాడు. 1962, 1964లో డిటెన్యూగా, 1970లో నాగిరెడ్డి కుట్ర కేసులో ముద్దాయిగా జైలు జీవితం గడిపారు. కుట్ర కేసులో నాలుగు సంవత్సరాలు జైలుశిక్ష పడగా బెయిల్‌పై బయటకు వచ్చారు. తెలంగాణ సాయుధ పోరాటం కాలం 8 సంవత్సరాలు, నక్సల్బరీ పోరాట కాలంలో 9 సంవత్సరాలు అజ్ఞాతవాసం గడిపారు. ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలో కేంద్ర కమిటీ సభ్యుడిగా, సీపీఎం నుంచి విడిపోయిన తర్వాత ఆంధ్రప్రదేశ్ విప్లవ కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శిగా, అనంతర కాలంలో భారత విప్లవకారుల సమైక్యతా కేంద్రం కేంద్ర కమిటీ కార్యదర్శిగా పని చేశారు.


దేవులపల్లి వెంకటేశ్వర్‌రావు

తొలితరం నేత

కమ్యూనిస్టు పార్టీకి తొలితరం నేతగా ప్రాముఖ్యత పొందారు. నాటి ఉమ్మడి కమ్యూనిస్టు ఉద్యమానికి నాయకత్వం వహించారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట కాలంలో నాయకత్వ స్థానంలో ఉన్నారు. నాడు గ్రామాల్లో భూస్వాముల దోపిడి, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాటాలు జరిపించారు. ఆనాడు భూస్వాముల నుంచి భూములను స్వాధీనం చేసుకొని ప్రజలకు పంచిపెట్టడంలో ఆయన పాత్ర గణనీయం. కమ్యూనిస్టు ఉద్యమం కష్టాల పాలైనప్పుడు సిద్ధాంతపరంగా వెన్నుదన్నుగా నిలిచారు. ఒక కుట్ర కేసులో జైలు జీవితం గడిపారు. తన కేసును తానే వాదించుకున్నారు. 400 పేజీల ప్రకటనను జడ్జి ముందు చదివారు. ఆయన జీవితాంతం నీతి, నిజాయితీ, నిరాడంబర జీవితానికి నిక్కచ్చిగా నిలిచారు. జనగామ ప్రాంతంలో చెదిరిన ఉద్యమాన్ని సాయుధ పోరాట దశకు చేర్చి, బెదిరిన ప్రజలను వీరయోధులుగా తీర్చిదిద్ది ఏనాడు శత్రువు చేతికి చిక్కకుండా పోరాట ప్రాంతాల్లో, సాయుధ దళాలతోనే ఉన్నారు. అడుగడుగునా పార్టీలోని మితవాదుల కుట్రలను ఎదిరించారు. రజాకార్లకే కాకుండా యూనియన్ సైన్యాలను సైతం మూడేళ్లకుపైగా ముప్పుతిప్పలు పెట్టిన పోరాటానికి మార్గదర్శిగా నిలిచారు.

రచయితగా..

దేవులపల్లి కలం నుంచి 'మా భూమి' వంటి అనేక నాటకాలు, కళారూపాలు, రచనలు, పాటలు, బుర్రకథలు వెలువడ్డాయి. 1983-84లో దేవులపల్లి కలం నుంచి జాలువారిందే 'తెలంగాణ ప్రజల సాయుధ పోరాట చరిత్ర'. తెలంగాణ పోరాట చరిత్రను ఆయన ఇందులో సవివరంగా గ్రంథస్తం చేసినా మొదటి భాగమే అందుబాటులోకి వచ్చింది. జనగామ ప్రజల వీరోచిత పోరాటం, హైదరాబాద్ కౌల్దారీ చట్టం అనే పుస్తకాలు రాశారు. సాయుధ పోరాట కాలం నాటి, అంతకన్న రెండు, మూడు దశాబ్దాలకు పూర్వం ఉన్న ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, రాజకీయ పరిస్థితులు, జన జీవన స్థితిగతులను వివరించే సాధికారత కలిగిన ఏకైక ప్రామాణిక గ్రంథం ఇది. 1968లో పోరాట ఉద్యమానికి పునాదులు వేయండి అన్న సుదీర్ఘమైన సర్క్యులర్‌ను విడుదల చేశారు. తక్షణ కార్యక్రమం పేరుతో తిరిగి విప్లవోద్యమాన్ని నిర్మించాల్సిన ఆవశ్యకతను గుర్తుచేశారు. దీని ఫలితంగానే 1975లో భాతర కమ్యూనిస్టు విప్లవకారుల సమైక్యత కేంద్రం ఏర్పడింది. ప్రొలిటేరియన్ పాత్, సంకేతం, జనశక్తి పత్రికల ద్వారా దేశంలో కమ్యూనిస్టు విప్లవకారుల్లో పొడచూపిన అతివాద, మితవాద పెడధోరణులకు వ్యతిరేకంగా తరిమెల నాగిరెడ్డితో కలిసి ఆయన చేసిన పోరాటం అద్వితీయం. 1984 జూలై 12న ఆయన గుండెపోటుతో చనిపోయారు.


లొంగిపోయిన మావోయిస్టులను మీడియాకు చూపుతున్న పోలీసులు

8 మంది మావోల లొంగుబాటు

» రూ.25 వేల చొప్పున రివార్డులు » అందించిన ఎస్పీ శబరీష్

ములుగు, మే 31 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా ఎస్పీ శబరీష్ ఎదుట 8 మంది మావోయిస్టు సభ్యులు లొంగిపోయారు. లొంగిపోయిన వారి వివరాలను ఎస్పీ శబరీష్ శనివారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. లొంగిపోయిన వారిలో డివిజనల్ కమిటీ సభ్యుడు దోర్పెట్టి మిర్గు అలియాస్ లింగ, ఏరియా కమిటీ సభ్యురాలు మడవి టిడో అలియాస్ రామె, ఏరియా కమిటీ సభ్యుడు మిడియం భీమా, పార్టీ సభ్యురాలు ఉయిక అనిత, పార్టీ సభ్యుడు మడకం కమలేష్, పార్టీ సభ్యురాలు సోయం భీమే, సీఎన్ఎం సభ్యుడు మడవి మడక అలియాస్ గుడ్డు, వికాస్ కమిటీ సభ్యుడు మదవి ఇడుము అలియాస్ భాస్కర్‌లు ఉన్నారని ఎస్పీ వెల్లడించారు. వీరికి రూ. 25వేలు అందించామని తెలిపారు. లొంగి పోయిన వారి కోసం వారి పేరు మీద ఉన్న రివార్డు సొమ్మును లొంగిపోయిన 24 గంటల్లో బ్యాంకు డీడీ రూపంలో అందజేస్తున్నామని, వారికి ఆరోగ్యపరమైన సమస్యలు ఉంటే వైద్య చికిత్స చేయిస్తున్నామని, పునావాసం కోసం ప్రభుత్వం నుంచి సహకారం అందేలా చూస్తున్నామని ఎస్పీ అన్నారు. ఈ కార్యక్రమంలో ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, ములుగు డీఎస్పీ రవీందర్, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి కథనంపై ఎస్పీ వివరణ

మే 30న ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన 'చిట్టీ.. చిక్కింది' కథనంపై ములుగు జిల్లా ఎస్పీ శబరిష్ వివరణ ఇచ్చారు. ఆమె పేరు చిట్టి కాదని.. ఐతె మడవి అని అన్నారు. మే 17న లొంగిపోయిన మావోయిస్టుల్లో ఒక సభ్యురాలి ఫొటోను డిస్‌ప్లే చేసి చూపించారు. ఐతె మడవి లొంగిపోయి చాలా రోజులు అవుతుందని, ఆమెను వారి తల్లిదండ్రులకు అప్పగించామని వివరించారు. కాగా మడకం కీడోకు, మడవి ఐతేకు ఎలాంటి సంబంధం లేకపోయినా పోలీసులు వివరణ ఇవ్వడంపై జిల్లాలో తీవ్ర చర్చ జరుగుతుంది. మరి లొంగిపోయింది మడవి ఐతెనా... లేక మడకం కీడోనా... అనేది ప్రశ్నార్థకంగా మిగిలింది. ఒకవేళ పోలీసులు ధ్రువీకరించింది మడవి ఐతె అయితే మరి చిట్టీ అలియాస్ మడకం కీడో వివరాలు ఎందుకు గోప్యంగా ఉంచుతున్నారనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి.

ఏటూరునాగారం ఇసుక క్వారీలో వసూళ్ల దందా!

- ఒక్కో లారీ నుంచి రూ. 200 చొప్పున వసూలు
- వేబ్రిడ్జి వద్ద అక్రమాలు, నిబంధనలకు తూట్లు
- టీజీఎండీసీ అధికారుల నిర్లక్ష్యంపై ఆరోపణలు

ఏటూరునాగారం, మే 31 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలో కొనసాగుతున్న ఇసుక క్వారీలో అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. ఇసుక లోడింగ్ చార్జీల పేరిట క్వారీ నిర్వాహకులు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు లారీ డ్రైవర్లు ఆరోపిస్తున్నారు. రూ. 1,400 నుంచి రూ. 2,000 వరకు అదనంగా వసూలు చేస్తున్నారని, దీనిపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని వాపోతున్నారు.

బయటపడ్డ అక్రమాల వీడియో

క్వారీ నిర్వాహకులు లోడింగ్ చార్జీల పేరుతో డబ్బులు తీసుకుంటున్న ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. ఈ వీడియోలో క్వారీ సిబ్బంది లారీ డ్రైవర్ నుంచి డబ్బులు వసూలు చేస్తున్న దృశ్యాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇది కేవలం ఒక ఉదాహరణ మాత్రమేనని, ప్రతీ లారీ నుంచి ఇలాగే వసూళ్లకు పాల్పడుతున్నారని డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

టీజీఎండీసీ అధికారుల నిర్లక్ష్యం

ఇసుక లోడింగ్ కోసం నిర్దిష్ట చార్జీలున్నా, క్వారీ నిర్వాహకులు అదనపు వసూళ్లకు పాల్పడుతున్నారు. అక్రమాలకు అడ్డుకట్ట వేయాల్సిన టీజీఎండీసీ (తెలంగాణ స్టేట్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్)అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ దందా యథేచ్ఛగా కొనసాగుతోందని డ్రైవర్లు మండిపడుతున్నారు.

వే బ్రిడ్జి వద్ద మామూళ్లు

ఏటూరునాగారం మండలం చిన్నబోయినపల్లి గ్రామంలో ఉన్న వే బ్రిడ్జి వద్ద అక్రమ వసూళ్ల పర్వం యథేచ్ఛగా కొనసాగుతోంది. ఇసుక లారీల నుంచి బలవంతపు వసూళ్లకు పాల్పడుతుండటంతో డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ అక్రమ వసూళ్లతో పాటు, వేబ్రిడ్జి వద్ద నెలకొన్న ట్రాఫిక్ సమస్యలు వాహనదారులు, ప్రజలకు సమస్యగా మారాయి.

అలాగే వే బ్రిడ్జి వద్ద ఇసుక బరువును తూకం వేసి, అందుకు సంబంధించిన చార్జీలు మాత్రమే వసూలు చేయాలి. అయితే, చిన్నబోయినపల్లి వేయింగ్ బ్రిడ్జి వద్ద క్వారీ నిర్వాహకులు, అదే గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు ప్రతీ లారీ నుంచి రూ. 200 నుంచి రూ. 300 వరకు లాగుతున్నారు. డబ్బులు ఇవ్వకపోతే లారీలను అడ్డుకొని బెదిరింపులకు పాల్పడుతున్నారని వారు చెబుతున్నారు.


లారీ డ్రైవర్ నుంచి డబ్బులు వసూలు చేస్తున్న క్వారీ నిర్వాహకుడు

ప్రభుత్వ ఆదాయానికి గండి

టీజీఎండీసీ అధికారులు తమ బాధ్యతలను విస్మరించి, వసూళ్ల దందాకు పరోక్షంగా సహకరిస్తున్నారని ఆరోపణలున్నాయి. క్వారీ నుంచి ఇసుక లోడ్ చేసుకుని వెళ్లే ప్రతి లారీ నుంచి అదనంగా వసూలు చేస్తున్నారని డ్రైవర్లు వాపోతున్నారు. దీనిపై ఉన్నతాధికారులు విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నారు. అక్రమ వసూళ్లతో సామాన్య ప్రజానీకంతో పాటు నిర్మాణ రంగానికి నష్టం వాటిల్లుతోంది. క్వారీ నిర్వాహకులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, టీజీఎండీసీ అధికారుల నిర్లక్ష్యంపై విచారణ జరిపించాలని లారీ డ్రైవర్లు, ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

దోమల బెడద.. రోగాలతో దడ

● ములుగు జిల్లాకు పొంచి ఉన్న ప్రమాదం.. ● ముందస్తు చర్యలు తీసుకోకపోతే తప్పని ఇబ్బందులు ●అవగాహన కల్పించాలంటున్న ప్రజలు

ములుగు, మే 31(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా ఏజెన్సీ ప్రాంతం కావడంతో వర్షాకాలం వచ్చిందటే చాలు విషజ్వరాలు విజృంభిస్తాయి.. ఈ తరుణంలో వరుస వర్షాలు కురుస్తుండడంతో అధికారులు ముందస్తు చర్యలు తీసుకోకపోతే అంతే సంగతులు.. వందల కొద్ది ప్రాణాలు పిట్టాల్లా రాలిపోవాల్సిందే.. ముఖ్యంగా ఏజెన్సీలోని గొత్తికోయగూడెలతో పాటు మారుమూల గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరముంది. అంతేగాకుండా ములుగు పట్టణంలోనూ దోమల బెడద తీవ్రంగా ఉంది. గత కొద్ది రోజులుగా జిల్లా వ్యాప్తంగా వర్షాలు అధికంగా కురుస్తుండడంతో ఎక్కడ పడితే అక్కడ చెత్త, మురుగు నీరు పేరుకుపోయి ఉంది. ఎప్పటికప్పుడు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాల్సిన సంబంధిత శాఖ అధికారులు నామమాత్రంగానే పనులు చేస్తూ చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. సైడు కాల్వల్లో, ఖాళీ స్థలాల్లో వర్షపు నీరు, చెత్త, చెదారం పేరుకుపోయి పందులు, కుక్కలు స్వైరవిహారం చేస్తున్నా యి. దీంతో దోమలు వృద్ధి చెంది.. విజృంభించడంతో ప్రజలు అనారోగ్యం బారిన పడి ఆస్పత్రుల పాలవుతున్నారు. మునిసిపల్, గ్రామ పంచాయతీ సిబ్బంది పట్టించుకోక పోవడంతో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- నివారణ చర్యలు శూన్యం

డ్రైనేజీలలో, ఖాళీ స్థలాల్లో మురుగు నీరు, చెత్తాచెదారం పేరుకుపోయి ఉండడంతో దోమలు విజృంభిస్తున్నాయి. ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేయాలిసిన సిబ్బంది నామమాత్రంగా పనులు చేసి చేతులు దులుపుకుంటున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. దోమలను నియంత్రించేందుకు ఫాగింగ్, దోమల మందు, యాంటి మస్కిటో లార్వా ఆయిల్ బాల్స్ స్ప్రేయింగ్ వంటి కార్యక్రమాలు చేపట్టడం లేదని అంటున్నారు. దోమల నియంత్రణ చర్యలు చేపట్టి వాటి బారీ నుంచి తమను కాపాడాలని జిల్లా ప్రజలు వేడుకుంటున్నారు.



విద్యాశాఖ కార్యాయల ఆవరణలో నిలిచి ఉన్న వర్షపు నీరు

- మలేరియా, డెంగీ బాధితుల వివరాలు

ములుగు జిల్లాలో గత మూడేళ్లుగా మలేరియా, డెంగీ వ్యాధుల బారిన పడిన వారి వివరాలు ఇలా ఉన్నాయి. 2023లో 76 మలేరియా కేసులు, 30 డెంగి కేసులు నమోదయ్యాయి. 2024లో 47 మలేరియా, 47 డెంగి కేసులు నమోదయ్యాయి. 2025 మే వరకు 13 మలేరియా 1 డెంగీ కేసులు నమోదైనట్లు జిల్లా వైద్యశాఖ అధికారులు వెల్లడించారు.

కేసుల వారీగా..

2023 నుంచి 2025 వరకు తాడ్వాయిలో 33 మలేరియా 7 డెంగీ కేసులు నమోదయ్యాయి. కొడిశాలలో 9 మలేరియా, నాలుగు డెంగీ కేసులు, కన్నాయిగూడెంలో 39 మలేరియా, 5 డెంగీ , వాజేడులో 12 మలేరియా, 4 డెంగీ కేసులు నమోదయ్యాయి. వెంకటాపూర్‌లో 3 మలేరియా , 5 డెంగీ కేసులు, గోవిందరావుపేటలో 4 మలేరియా కేసులు, 19 డెంగీ మంగపేటలో 5 మలేరియా, మూడు డెంగీ, ఐయ్యారలో 10 డెంగీ కేసులు, 8 డెంగీ కేసులు నమోదయ్యాయి. చుంచుపల్లిలో 1 మలేరియా కేసు , 1 డెంగీ కేసు, బ్రాహ్మణపల్లిలో 1 మలేరియా కేసు, కాటాపూర్‌లో 3 మలేరియా కేసులు, రెండు డెంగీ కేసులు, పేరూరులో 4 మలేరియా కేసులు నమోదయ్యాయి. ఏ టూరులోట 10 మలేరియా కేసులు నవెదుఉ కాగా 3 డెంగీ కేసులు నమోదయ్యాయి. వస్రాలో 3 డెంగీ కేసులు 1 మలేరియా కేసు నమోదయ్యాయి. రాయినిగూడెంలో 23 డెంగీ కేసులు నమోదయ్యాయి.

చర్యలు తీసుకుంటున్నాం : గోపాల్‌రావు, డీఎంహెచ్‌వో



వర్షాకాలం సమీపిస్తుండడంతో మలేరియా డిపార్ట్ మెంట్‌ను అలర్ట్ చేశాం. హైరిస్క్ ప్రాంతాల్లో యాంటీ లార్వా, యాంటీ అడల్ట్ తదితర స్ప్రేలను దోమల నివారణ కోసం పిచికారీ చేయిస్తున్నాం. ప్రతి శుక్రవారం ఫ్రైడే-డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. ప్రజలకు అన్నివిదాల వైద్యసేవలు అందేలా జాగ్రత్త చర్యలు తీసుకున్నాం

ఉపాధ్యాయుల సర్దుబాటును విరమించుకోవాలి

భూపాలపల్లిటౌన్, మే 31 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సర్దుబాటు కార్యక్రమాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు చిలువేరు అశోక్, ప్రధాన కార్యదర్శి అయిత తిరుపతి అన్నారు. శనివారం ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. ఉపాధ్యాయుల సర్దుబాటుకు సంబంధించి జిల్లా కలెక్టర్లకు అధికారమిస్తూ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ద్వారా ఉత్తర్వులు వచ్చాయని అన్నారు. ప్రాథమిక పాఠశాలలో ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు తప్పనిసరిగా ఉండాలని, ప్రతీ తరగతికి ఒక ప్రత్యేక గది ఉండాలని, మౌలిక సౌకర్యాల కల్పన సమగ్రంగా ఉండాలని డిమాండ్ చేశారు.

వందపడకల ఆస్పత్రిని సందర్శించిన ఎస్‌ఈ

భూపాలపల్లిటౌన్, మే 31 (ఆంధ్రజ్యోతి): వందపడకల ఆస్పత్రిని శనివారం విద్యుత్‌శాఖ జిల్లా అధికారి తనిఖీ చే శారు. ఈ మేరకు ఆస్పత్రి సూపరింటెండెంట్‌తో సమీక్షించారు. ఆస్పత్రిలో 24గంటలు విద్యుత్ ఉండేలా చర్యలు చేపట్టామని అన్నారు. ఈమేరకు ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ఆయనకు వివరించారు. ఈ కార్యక్రమంలో డీఈ పాపిరెడ్డి, ఏడీఈ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ ఇళ్ల నిర్మాణాలపై చర్య తీసుకోవాలి

కాటారం, మే 31(ఆంధ్రజ్యోతి):మండలంలోని రేగులగూడెం, ఇబ్రహీంపల్లి, కాటారం జీపీల పరిధిలో అసైన్డ్, లావన్ పట్టా భూముల్లో అక్రమంగా చేపట్టిన ఇళ్ల నిర్మాణాలపై అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆత్కూరి శ్రీకాంత్ డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో శనివారం శ్రీకాంత్ పలువురు ప్రజా సంఘాల నేతలతో కలిసి మాట్లాడుతూ అక్రమ ఇళ్ల నిర్మాణాలపై అధికారులు తూతూమంత్రంగా నోటీసులిచ్చి చేతులు దులుపుకుంటున్నారని ఆరోపించారు. అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

చిట్యాల, మే 31 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాలతో పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడిన మహిళ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అందుకుతండా శివారు ఒంటిప్పతండా గ్రామానికి చెందిన బానోతు తిరోజ (35) ఈనెల 28న కుటుంబ సభ్యులతో కలిసి తన తమ్ముడు రవి వివాహానికి వెళ్ళింది. అక్కడి నుంచి పుట్టిళ్ల అయిన మంచిర్యాల జిల్లా కాశిపేట మామిడిగూడతండలో 29న జరిగిన రిసెప్షన్‌కు హాజరయ్యారు. కాగా తిరోజ భర్త రవినాయక్ అదేరోజు బంధువులతో ఘర్షణ పడి సొంత గ్రామానికి చేరుకున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం ఒంటిప్ప తండాలోని ఇంటికి చేరుకున్న తిరోజ భర్త తిడుతాడనే భయంతో ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు చిట్యాల సామాజిక ఆస్పత్రికి, అక్కడినుంచి వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి కి తరలించారు. తిరోజ ఆరోగ్య పరిస్థితి విషమించి శనివారం మృతి చెందింది. మృతురాలి సోదరుడు సంపత్ పిర్యాదు మేరకు ఎస్సై శ్రావణ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జిల్లా సమాఖ్య ఎన్నికలు త్వరగా నిర్వహించాలి

మొగుళ్లపల్లి, మే 31 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా వెలుగు సమాఖ్య ఎన్నికలు త్వరగా నిర్వహించాలని బీజేపీ జిల్లా, నియోజకవర్గ కన్వీనర్ మోరె రవీందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం ఆయన మండలకేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని అన్ని మండలాల్లో వెలుగు మండల సమాఖ్య ఎన్నికలు పూర్తయి మూడునెలలు కావస్తుందని అన్నారు. ఇప్పటివరకు కూ డా జిల్లా సమాఖ్య ఎన్నికలు నిర్వహించకుండా అధికారులు కాలయాపన చేస్తూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈవిషయమై డీఆర్‌డీఏ పీడీ స్పందించి త్వరగా జిల్లా సమాఖ్య ఎన్నికలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

పచ్చిరొట్ట.. దిగుబడిలో దిట్ట..

(5వ పేజీ తరువాయి)

మారుతాయి. నేలలోని సేంద్రియ కర్బనాన్ని పెంపొందిస్తుంది. తేలికపాటి నేలలు సారవంతంగా మారుతాయి. పంటల దిగుబడులు పెరగడానికి తోడ్పతాయి.

● భూమిలో గల సూక్ష్మజీవరాశికి ఆహారంగా మారి భూమిలో ఉన్న మొక్కల వేర్లకు పోషకాలను అందుబాటులోకి తీసుకురావడానికి దోహదం చేస్తుంది. వరి పంట పండించే నేలలో భూమిని వదులుగా చేసి గాలి ప్రసరణ పెంచుతుంది.

● పంటలకు స్థూల, సూక్ష్మ పోషకాలను అందిస్తుంది. తేలికపాటి నేలల్లో నీటి నిల్వ చేసుకునే శక్తి పెరుగుతుంది.

● తొలకరి వర్షాల సమయంలో నేలలో నీటిని వేగంగా ప్రవహించకుండా భూమి పొరల్లోనే ఇంకే విధంగా దోహదం చేస్తుంది. పోషకాలు భూమి లోపలి పొరల్లోకి కిందికి వెళ్ళకుండా వేర్ల ద్వారా పట్టివుంచుతుంది

● గాలిలోని నత్రజనిని రైజోబియం బ్యాక్టీరియా ద్వారా నేలలో స్థిరీకరణ చేయు విధంగా సాయపడుతుంది. దీని వల్ల హెక్టార్‌కు 100కిలోల నత్రజని ఎరువు ఖర్చు రైతుకు ఆదా అవుతుంది.

● చౌడు నేలల్లో వరుసగా 4 లేదా5 సీజన్లలో జీలుగ వంటి పచ్చి రొట్ట ఎరువులు వాడితే చాలావరకు చౌడు ప్రభావం తగ్గుముఖం పడుతుంది.

●భూమిలో ఉన్న చెడు శిలీంద్రాలను నాశనం చేసి అగ్గితెగులు, కాండం కుళ్లు రాకుండా నివారిస్తుంది.

శ్రీ బాలాజీ దేవాలయానికి భూమి పూజ

మహాముత్తారం, మే31(ఆంధ్రజ్యోతి): మండలంలోని బోర్లగూడెం గ్రామంలో శనివారం భూనీల సమేత శ్రీబాలాజీ వేంకటేశ్వరస్వామి దేవాలయానికి శనివారం దేవపండితుల చేత భూమి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హేమసాత్ మహారాజ్ వంశపరంపర పూజారులు రామాచార్యులు, రమేష్ ఆచార్యులు, కరుణాకరా చార్యులు సంప్రదాయ పద్ధతులతో పూజలు నిర్వహించారు. స్థపతి శ్రీధర్ బాబు ఆలయ పనులు లంచనంగా ప్రారంభించారు. ఆలయ కమిటీ చైర్మన్ పూల్‌సింగ్, రామ్‌సింగ్, నవ్‌రాంనాయక్, భాస్కరాచారిలతో పాటు తండా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి మంత్రి పరామర్శ

గణపురం, మే 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెల్పూరు గ్రామ పంచాయతీకి చెందిన అడ్డూరి కిషన్‌రావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా శనివారం వారి కుటుంబ సభ్యులను రాష్ట్ర ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ ప్రకాశ్‌రెడ్డి పరామర్శించారు. కిషన్‌రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి వారి కుటుంబానికి సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు మలహాల్ రావు, గోపాల్‌రావు తదితరులు ఉన్నారు.

ఘనంగా పౌరహక్కుల దినోత్సవం

మొగుళ్లపల్లి, మే 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొర్కిశాల గ్రామంలోని ఎస్సీకాలనీలో శనివారం పౌరహక్కుల దినోత్సవాన్ని అధికారులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శివరామకృష్ణ మాట్లాడుతూ అంటరానితనాన్ని నిర్మూలించాలని, వారి హక్కులకు భంగం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. అనంతరం గ్రామస్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

● మల్హర్ : మండలంలోని ఎడ్లపల్లిలో శనివారం అధికారులు సివిల్ రైట్స్ కార్యక్రమం నిర్వహించారు. సమాజంలో అసమానతలు పాటించవద్దన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, పోలీస్ అధికారులు, గ్రామస్తులు ఉన్నారు.

గోగుపల్లిలో గంగా బోనాల సందడి

ఏటూరునాగారం, మే 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోగుపల్లిలో శ్రీ బీరప్ప పెద్ద పండుగ, స్వామి వారి కళ్యాణ మహోత్సవంలో భాగంగా శనివారం బీరప్ప స్వామికి భక్తులు ఘనంగా గంగా బోనం, లింగాలు తెచ్చుట కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఉదయం 10 గంటలకు గంగా బోనం, పోషమ్మ బోనం, మైల బోనం, రఘు బోనం చేశారు. అనంతరం లింగాలను, బోనాలను తమ తమ ఇంట్లో నుంచి గ్రామంలోని బీరప్ప స్వామి ఆలయానికి తెచ్చి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పాల్గొని పూజ కార్యక్రమాల్లో తిల కింది స్వామి వారి తీర్థ ప్రసాదలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో గోగుపల్లి కురుమ సంఘం కుల పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం : ఎమ్మెల్యే గండ్ర

చిట్యాల, మే 31 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి బాల్ బ్యాట్మింటన్ క్రీడా పోటీలను భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు శనివారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే జీఎస్సార్ మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక ధృడత్వానికి దోహదపడుతాయన్నారు. చిట్యాల ఏఎంసీ చైర్‌పర్సన్ గుమ్మడి శ్రీదేవి, మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి, టౌన్ అధ్యక్షుడు బుర్ర లక్ష్మణ్, నాయకులు రాంనర్సింహారెడ్డి, దొడ్డి కిష్టయ్య, చిలుకల రాయకొంరు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అల్లకొండ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా నూతన కమిటీ ఎన్నిక..

బాల్ బ్యాట్మింటన్ జయశంకర్ భూపాలపల్లి జిల్లా నూతన కమిటీని శనివారం మండల కేంద్రంలో ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా గూట్ల తిరుపతి, ప్రధానకార్యదర్శిగా గుత్తికొండ సాంబయ్య, ఉపాధ్యక్షులుగా వెంకట్రాంరెడ్డి, బుచ్చిరెడ్డి, స్వామి, అమ్జత్‌పాషా, కోశాధికారిగా రవీందర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే గండ్ర

పెట్టుబడి తగ్గించుకోవాలి

రేగొండ : రైతులు ఎరువులు, పురుగుమందులపై పెట్టుబడి తగ్గించుకుని ఆదాయం పెంచుకునే మార్గాలు అనుసరించాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో మండల వ్యవసాయ అధికారి వాసుదేవరెడ్డి అధ్యక్షతన రైతు ముంగిట్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హాజరయ్యారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్వేత, మార్కెట్ కమిటీ చైర్మన్ కిష్టన్న, పీఏసీఎస్ చైర్మన్ విజ్ఞన్‌రావు, జిల్లా ఉద్యాన అధికారి సునీల్, జిల్లా వ్యవసాయాధికారి తదితరులు పాల్గొన్నారు.

యోగాపై అంగన్‌వాడీల ర్యాలీ

మంగపేట, మే 31 (ఆంధ్రజ్యోతి) మండలంలో చుంచుపల్లిలో శనివారం సాయంత్రం ఆదివారం యోగ అంతర్జాతీయ దినోత్సవాన్ని పురష్కరించుకొని ఐసీడీఎస్ మల్లూరు సెక్టార్ పరిధిలో పనిచేస్తున్న అంగన్‌వాడీ టిచర్లు యోగ అవశ్యకతపై పలు రకాల నినాదాలు చేస్తూ పుర వీదులలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐసీడీఎస్ మల్లూరు సెక్టార్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, యోగి వేమన కేంద్రం గురువు యర్రంకాని రాంబాబు(పీటీజీ) హాజరై మాట్లాడారు. మల్లూరు సెక్టార్ అంగన్‌వాడీ టీచర్లు ఆయాలు పాల్గొన్నారు.

గిరిజన చట్టాలను ఉల్లంఘించిన వారిపై చర్య తీసుకోవాలి

మంగపేట, మే 31 (ఆంధ్రజ్యోతి) ఆంధ్రప్రదేశ్ లోని రంపచోడవరంలో ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్ ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలను కట్టడాలను తొలగిస్తుంటే ములుగు జిల్లాలో జిల్లా కలెక్టర్ ఏటూరునాగారం ఐటీడీఏ పీవోలు ఎందుకు అక్రమ నిర్మాణ కట్టడాలపై ప్రభుత్వ భూములపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని గిరిజనాభ్యుదయ సంఘం రాష్ట్ర జనరల్ సెక్రెటరీ ముద్దబోయిన రవి ప్రశ్నించారు. శనివారం మంగపేటలో రవి విలేకర్లతో మాట్లాడారు. పార్లమెంట్ చేసిన గిరిజన చట్టాలను ఉల్లంఘిస్తున్న వారిపై జిల్లా కలెక్టర్ ఏటూరునాగారం ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్ చర్యలు తీసుకుని ఫీల్డ్‌మీద ఆచరణ చూపించాలని రవి డిమాండ్ చేశారు.

శ్రీచండీశ్వర కాల బైరవ విగ్రహాల ప్రతిష్ఠాపన



భక్తులకు అన్నదానం చేస్తున్న దృశ్యం, విగ్రహాలు ఇవే

మంగపేట, మే 31 (ఆంధ్రజ్యోతి) మంగపేట శ్రీ ఉమాచంద్రశేఖర స్వామి దేవాలయం లో వెలిసియున్న శ్రీ చండీశ్వరుడు కాలబైరవస్వామి విగ్రహాలను శనివారం ప్రారంభ పూజా కార్యక్రమాలు శాస్త్రప్రకారంగా అర్చక బృందం నిర్వహించింది. కాల బైరవుడు చండీశ్వరుడుల యంత్రమూర్తి ప్రతిష్ఠలను ఆలయ ప్రధానార్చకుడు విస్సావఝ్జల నరేష్‌శర్మ యువన్ శర్మ, మణికంఠ మణిశర్మలు మంత్రోచ్ఛరణలతో ప్రాణ ప్రతిష్ఠలను వైభవంగా చేశారు. విగ్రహదాతలు డొక్క సతీష్-శీరీష నూకల వెంకట్రావు- అనూరాధ చిదిరాల వంశీకృష్ణ- దీవ్యశ్రీలు ఈ ప్రతిష్ఠదాతలుగా వ్యవహరించి పూజల్లో పాల్గొన్నారు. అనంతరం గొల్లపిల్లి శ్రీకాంత్‌రెడ్డి భక్తులకు ఆలయ ప్రాంగణంలో మహా అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొలగట్ల నరేష్‌రెడ్డి దంపతులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో విత్తనాలు



పీఏసీఎస్ వద్ద రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను అందిస్తున్న ఏవో

వాజేడు, మే 31(ఆంధ్రజ్యోతి): రైతులకు విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయశాఖ అధికారి మంజా మహేష్ తెలిపారు. వాజేడు పీఏసీఎస్‌లో రైతులకు అందుబాటులో160 బస్తాల జీలుగు, 25 బస్తాలు జనుము విత్తనాలు ఉన్నాయన్నారు. జీలుగు బస్తా 30 కేజీలు సబ్సిడి ధర రూ రూ 2130లు, జనుము సబ్సిడిపై రూ 2510లు విక్రయిస్తున్నట్లు పేర్కొన్నారు. అంతేకాకుండా తెలంగాణ విత్తనభివృద్ధి సంస్థ వారి నాణ్యమైన విత్తనాలు కూడా అందుబాటులో ఉన్నాయన్నారు. ముఖ్యంగా ఆర్ఎన్ఆర్ 15048 రకం 25 కేజీల బస్తా ధర 1075, కేఎన్ఎం 1638 బస్తా రూ. 1075, బీపీటీ రూ 1137, ఎంటీయూ రూ 1137, ఎంటీయూ 1010 రకం రూ 960లుకు అందుబాటులో ఉన్నాయని, రైతులు పీఏఎస్ కేంద్రంలో తీసుకోవాలని ఆయన సూచించారు.

కార్యకర్తలకు అండగా ఉంటా

మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు



కార్యకర్తలతో మాట్లాడుతున్న పుట్ట మధు

కాటారం, మే 31(ఆంధ్రజ్యోతి):ప్రజా సమస్యలపై పోరాటం చేసే ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని బీఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జి, మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు అన్నారు. శనివారం కాటారం మండల కేంద్రంలో పర్యటించి పలువురు కార్యకర్తలతో మాట్లాడారు. ఇటీవల సోషల్ మీడియాలో మంత్రి శ్రీధర్‌బాబుపై అనుచిత పోస్ట్ పెట్టిన బీఆర్ఎస్ నేత జక్కు శ్రావణ్‌ను పోలీసులు అరెస్ట్ చేయగా వెంటనే బెయిల్ వచ్చేలా చేసిన మధుకు పలువురు నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా, మండల నాయకులు జక్కు రాకేష్, కొండగొర్ల వెంకటస్వామి, పంతకాని సడువలి, శ్రీలక్ష్మీచౌదరి, తైనేని సతీష్, మానెం రాజబాపు, వంగల రాజేంద్రచారి, రామిళ్ల రాజబాపు, జక్కు శ్రావణ్, తోట రామచంద్రం, టీవీ రమణ, నాయక్ తదితరులు ఉన్నారు.

పాము కాటుతో మహిళ మృతి



సారక్క(ఫైల్)

మహాముత్తారం, మే31(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనంపేట గ్రామానికి చెందిన మహిళ మడవ సారక్క(46) శుక్రవారం రాత్రి పాము కాటుకు గురై మృతి చెందింది. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం సాయంత్రం 7 గంటలకు పశువుల పాకలోకి వెళ్లి పని పూర్తి చేసుకొని ఇంటికి వచ్చిన మహిళ వంట పూర్తి చేసి అందరికి వడ్డించి, తాను భోజనం చేసిందని తెలిపారు. 8.30 గంటలకు తనకు శరీరంలో ఏమో జరుగుతుందని, నాలుక మొద్దుబా రినట్లు అవుతుందని తెలుపగా స్థానికంగా ఆర్ఎంపీ వద్దకు తీసుకెళ్లామని, పరిస్థితి విషమించిందని ఆసుపత్రికి తరలించాలని సూచించాడని తెలిపారు. భూపాలపల్లిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరిక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. పాముకాటు వేసిన విషయాన్ని మహిళ పని హడావుడిలో గుర్తించక పోవడంతో సరైన సమయంలో ఆసుపత్రికి తీసుకెళ్లలేక పోయమని వారు తెలిపారు. కాగా మృతురాలికి భర్త, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

జీపీవో పరీక్షలో నరేష్‌కు 42వ ర్యాంకు



నరేష్‌ను సన్మానిస్తున్న తహసీల్దార్

మల్హర్, మే 31(ఆంధ్రజ్యోతి) రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన గ్రామ పరిపాలన అధికారి పరీక్షలో తాడిచర్ల తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న గొట్టం నరేష్ రాష్ట్రస్థాయిలో 42వ ర్యాంకు సాధించాడు. తాడిచర్ల గ్రామానికి చెందిన నరేష్ జీపీవో పరీక్షలో జిల్లా స్థాయిలో మొదటి ర్యాంకు సాధించడం పై తహసీల్దార్ రవికుమార్‌తో పాటు సిబ్బంది శనివారం ఆయనను శాలువాలతో ఘనంగా సన్మానించారు.

ఉద్యోగికి పదవీ విరమణ సహజం



జవహర్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

గోవిందరావుపేట, మే 31 (ఆంధ్ర జ్యో తి): ప్రభుత్వ ఉద్యో గికి పదవీ విరమణ సహజమని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ అన్నారు. మండల కేంద్రంలోని పీఎస్ ఆర్ గార్డెన్‌లో శనివా రం స్థానిక ఎంపీడీవో గార్లపాటి జవహర్‌రెడ్డి పదవీ విరమణ సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన జవహర్‌రెడ్డి దంపతులను శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. మాజీ ఎంపీపీ సూడి శ్రీనివారెడ్డితోపాటు బీఆర్ ఎస్ నాయకులు, కార్యాలయ అధికారులు, వివిధ శాఖల అధికారులు సత్కరించారు.

ఇది మాదిగ జాతికి దక్కిన గౌరవం

(5వ పేజీ తరువాయి)

స్వప్నాన్ని సాకారం చేసిన ప్రధానమంత్రి నరేంద్రమోదీకి, తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబునాయుడు, రేవంత్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ప్రకటించారు. ఎస్సీ వర్గీకరణ సాధించడం మాదిగ జాతి ఉద్యమ విజయమని కృష్ణ మాదిగ పేర్కొన్నారు. ఓరుగల్లు బిడ్డగా ప్రయాణం మొదలుపెట్టి.. ప్రకాశం జిల్లాలో ఉద్యమానికి పునికిపుచ్చుకుని ఈ స్థాయికి చేరడానికి మాదిగ జాతి బిడ్డల త్యాగాలతోపాటు అన్ని వర్గాల ప్రజలు సహకారం అందించారని అన్నారు. పద్మశ్రీ పురస్కారం పొందిన అనంతరం న్యూఢిల్లీ నుంచి ఏపీ ఎక్స్‌ప్రెస్‌లో శనివారం రాత్రి వరంగల్‌కు చేరుకున్న కృష్ణ మాదిగకు ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు.

పొగాకు ఉత్పత్తులు.. క్యాన్సర్‌కు కారకాలు

- ములుగు డీఎంహెచ్‌వో గోపాల్‌రావు

ములుగుటౌన్, మే 31 (ఆంధ్రజ్యోతి): పొగాకు ఉత్పత్తులు వాడడం వల్ల వివిధ క్యానర్‌లు వచ్చే ప్రమాదం ఉందని, ప్రతి ఒక్కరూ పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని డీఎంహెచ్‌వో గోపాల్‌రావు అన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో శనివా రం ములుగులోని ఏరియా ఆస్పత్రి ఆవరణలో చేపట్టిన అవగాహన ర్యాలీని డీఎంహెచ్‌వో జెండా ఊపి ప్రారంభి ంచారు. ఈ ర్యాలీ ఏరియా ఆస్పత్రి నుంచి మొదలుకుని బస్టాండ్ సెంటర్ వరకు కొనసాగగా వైద్యులు, సిబ్బంది పొగాకు ఉత్ప త్తులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం సమాజంలోని ప్రజలను పొగాకుకు దూరంగా ఉంచుతామని సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమ ంలో జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్లు పవన్‌కుమార్, శ్రీకాంత్, నాగ్ అన్వేష్, డిమో సంపత్, డీపీఎంవో సాంబయ్య, ఎన్సీడీ కో ఆర్డినేటర్లు వెంకటరెడ్డి, భూపాల్‌రెడ్డి, మానిటరింగ్ సూపర్‌వైజర్ సురేష్‌బాబు తోపాటు పీహెచ్‌సీల వైద్యులు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

●వాజేడు : పొగాకు దూరంగా ఉండాలని వైద్యఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా వైద్యసిబ్బంది మండల కేంద్రంలో అవగాహన ర్యాలీని నిర్వహించారు. పీహెచ్‌సీ నుంచి హనుమాన్ సెంటరు వరకు ప్రదర్శన నిర్వహించారు. వైద్యులు మహేందర్, తరుణ్, హెచ్ఈవో వేణుగోపాలకృష్ణ, హెచ్ఎస్ కోటిరెడ్డి, హెచ్ఏలు తిరుపతి, చిన్నవెంకటేశ్వర్లు, శేఖర్, ఏఎన్ఎంలు సత్యనాగవేణి, ఛాయదేవి, రాజేశ్వరి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో గోపాల్‌రావు